TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 330 ఆదివారం, అక్టోబర్ 25, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు

అత్యుత్తమమైన సేవలు,

ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.

జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు

- అత్యవసర & క్రిటికల్ కేర్
- ప్రమాద సేవలు
- ప్రసూతి & గైనకాలజీ
- ఆర్థోపెడిక్స్
- జాయింట్ రీప్లేస్‌మెంట్స్
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ
- మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
- పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
- న్యూరాలజీ • న్యూరోసర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
- యూరాలజీ • డెర్మటాలజీ
- సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ

అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్

+91 85230 89599 +91 86889 09384

www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా - సీఎం రేవంత్ ఛాయిస్..!!

హైదరాబాద్, అక్టోబర్ 24: తెలంగాణ కాంగ్రెస్ లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మంత్రులు పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ కీలక దిశా నిర్దేశం చేసారు. ఇక.. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాల పైనా స్పష్టత ఇచ్చారు. ఇక.. ఇప్పుడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా పార్టీ నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తిగా మారుతున్న వేళ.. సీఎం క్లియర్ గా సంకేతాలు ఇచ్చారు. రేసులో ఉన్నవారిలో ఉత్కంఠ పెరుగుతోంది.ఎల్‌నినో దెబ్బ, కరువు ముప్పు.. పేదలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్! తెలంగాణలో గవర్నర్ కోటా మూడు ఎమ్మెల్సీ స్థానాలు భర్తీ కానున్నాయి. ఈ సీట్ల ఖరారు పైన ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ ఈ సీట్ల ఖరారు వేళ పార్టీ నేతలకు సంకేతాలు ఇచ్చారు. సామాజిక వర్గాల వారీగా ఎవరికి సీట్లు కేటాయిస్తారనేది స్పషత వస్తోంది. ఓ స్థానాన్ని పద్మశాలీలకు, మరోస్థానాన్ని ముదిరాజ్ కులస్తులకు కేటాయించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మేరకు రేవంత్ ఇచ్చిన సంకేతాలు క్లియర్ గా ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల భద్రత, నేరాల కట్టడికి సీఎం రేవంత్ రెడ్డి పిలుపు ఇక.. మూడో స్థానం కోసం పోటీ పెరుగుతోంది. సామాజిక



సమీకరణాలే కీలకంగా మారాయి. తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులు సైతం ఈ మూడో స్థానం కోసం పోటీ పడుతున్నారు. కాగా.. పద్మశాలి వర్గం నుంచి కొండడా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె డాక్టర్ పవిత్ర వాణి కి ఛాన్స్ దక్కుతుందని పార్టీ నేతలు చెబుతున్నారు. అదే విధంగా మరో సీటు ముదిరాజ్ వర్గానికి ఇవ్వటం దాదాపు ఖాయమైంది. అందులో భాగంగా ఈ వర్గం నుంచి నీలం మధు, ఎం. సునీత రావు వంటి నాయకులు తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారు.మూడో స్థానం కోసం ఓసీ వర్గాల నుంచి ఆర్‌టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, గుండెపల్లి దయా సాగర్, పవన్ మల్లాది, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు, టీశాట్ సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తదితరులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అదే విధంగా ఎస్సీ వర్గాలకు కేటాయిస్తే సంపత్ కుమార్ కు ఛాన్స్ దక్కవచ్చని అంచనా వేస్తున్నారు. బీసీ వర్గాల నుంచి సట్టు మల్లేశం, చనగాని దయాకర్, చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, నేరెళ్ల శారద పేర్లు ప్రముఖంగా రేసులో ఉన్నాయి. దీంతో.. మూడో స్థానంలో రేవంత్ ఎవరికి అవకాశం ఇస్తారనేది ఇప్పుడు పార్టీలో ఆసక్తి కరంగా మారుతోంది. వచ్చే వారం ఈ పేర్ల పైన స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.

## బీజేపీ ఆపరేషన్ తెలంగాణ: మోదీ-షా బిగ్ స్కెచ్, ఇక నుంచి..!!



ఢిల్లీ కేంద్రంగా తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తెలంగాణాలో మూడేళ్లు పూర్తవుతోంది. దీంతో.. వచ్చే ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. బీజేపీ కొత్త వ్యూహాలు సిద్ధం చేస్తోంది. బీఆర్ఎస్ తిరిగి బలోపేతం కావాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. త్వరలో జరిగే గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నిక నుంచి కొత్త రాజకీయం మొదలు కానుంది. ఇందు కోసం ప్రధాని మోదీ- అమిత్ షా ద్వయం ఆపరేషన్ తెలంగాణ ప్రారంభం కోసం వ్యూహాలతో సిద్ధమైంది.తెలంగాణలో మిషన్ 2028 మొదలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్ల కాలం పూర్తి కానుంది. ఈ క్రమంలో 2028 ఎన్నికల కోసం ప్రధాన పార్టీలు కొత్త వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. బీఆర్ఎస్ తిరిగి తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్ లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్తోంది. అటు బీజేపీ సైతం వచ్చే ఎన్నికల పైన భారీగా ఆశలు పెట్టుకుంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి దక్షిణాదిలో బలపడాలని భావిస్తోంది.అందులో భాగంగా తెలంగాణ, కర్ణాటక పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. దక్షిణాదిలో మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి అధికారంలో ఉంది. తమిళనాడు విజయ్ ప్రభుత్వం కాంగ్రెస్ తో కొనసాగుతోంది. దీంతో, తెలంగాణలో ఈ సారి ఎలాగైనా పట్టు పెంచుకోవాలనే వ్యూహాలతో ముందుకు వెళ్తోంది. ఇందు కోసం నేరుగా ప్రధాని మోదీ- అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగుతున్నారు.ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ కు ఇంకా ప్రజల్లో ఆదరణ పెరగలేదని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు... ఖైరతాబాద్ ఉప ఎన్నిక నుంచే తమ బలం పెరిగేలా కార్యాచరణ అమలు చేయాలని బీజేపీ నేతలు డిసైడ్ అయ్యారు. కాంగ్రెస్ వర్సస్ బీఆర్ఎస్ గా మారిన రాజకీయంలో ప్రజలు తమ వైపు చూసేలా కొత్త వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. నవంబర్‌లో హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించబోతున్నారు.ఆయన పూర్తిగా సంస్థాగత ప్రక్షాళనపైనే దృష్టి పెట్టటంతో పాటుగా నేతల మధ్య సమన్వయం.. ఎన్నికల వరకు ప్రజలతో మమేకం అయ్యే విధంగా రోడ్ మ్యాప్ ఫిక్స్ చేయనున్నారు. ఇక.. డిసెంబర్‌లో జరగనున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన కీలకం కానుంది.

## టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

హైదరాబాద్ : సమావేశంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు,వివేక్ వెంకట్ స్వామి,ఏఐసిసి ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కి గౌడ్,ఇతర ముఖ్య నేతలు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూన్యాయవాదులు ప్రత్యేక మైన వృత్తి తెలంగాణ రావడంలో న్యాయవాదుల పాత్ర మరువలేనిది2023 లో ప్రజా పాలన ప్రభుత్వం రావడంలో మీరు కీలక పాత్ర పోషించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తోటి న్యాయవాది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి ని గెలిపించడానికి కృషి చేయాలి. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన అడ్వకేట్ లకు సంబంధించి సముచిత న్యాయం జరగాల్సి ఉందిగతంలో జరిగిన నియామకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ అనుబంధ వారికి అవకాశాలు ఇవ్వాల్సి ఉందితెలంగాణ లోని 33 జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఉన్నాయి. అక్కడ అడ్వకేట్స్ పార్టీకి సంబంధించిన లీగల్ ఇష్యూస్ కి అండగా ఉండాలిప్రభుత్వానికి సంబంధించిన అంశాలపై కూడా పార్టీ లీగల్ సెల్ అండగా ఉండాలిపార్టీ కార్యకర్తలకు ప్రొటెక్ట్ చేసే సమయంలో లీగల్ అండగా ఉండాలినామినేటెడ్ పోస్టుల్లో మీకు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఎలకతుర్తి లాంటి ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం కోర్టులు ఏర్పాటు




చేసిందిన్యాయపరమైన పదవుల్లో కాంగ్రెస్ వారికి అవకాశాలు ఇవ్వడం న్యాయ పరమైన సలహాలు ఇవ్వడంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కారం చేయడంలో వారికి ఇళ్ల స్థలాలు ఇల్లు ఇచ్చే ఆలోచనపై కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

## నా చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యా: మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 24 : మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. స్త్రీల రాజకీయ ఎదుగుదలలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమించి వనితలు ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. ) హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహిళా రాజకీయ నాయకత్వం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ గురుదీప్ సింగ్ సత్పాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోటా నీలిమ, పెద్దఎత్తున మహిళ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.'నా చిన్నతనంలో నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. ఆకలి బాధలు చూశాను.. అయినప్పటికీ అన్ని కష్టాలను ఎదుర్కొని.. నేడు ఈ స్థాయికి చేరుకున్నాను. ములుగు ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పెద్దల అండదండలతో పంచాయతీరాజ్ శాఖకు మంత్రి కాగలిగాను. నాకు ఎలాంటి రాజకీయ బ్యాక్ గ్రౌండ్ లేదు. అపర వనరులు ఉన్న ప్రాంతం ములుగు. అలాంటి ప్రాంతంలో ఒక పేద కుటుంబంలో నేను జన్మించాను. చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యాను. నేనెప్పుడూ నక్సలైట్ అవుతానని



అనుకోలేదు.. కానీ నక్సలైట్ అయ్యాను. ఆ తర్వాత లాయర్, ఎమ్మెల్యే, మంత్రి అవుతానని ఎన్నడూ ఊహించలేదని.. కానీ కష్టాన్ని నమ్ముకొని పనిచేశాను. నేడు మంత్రిగా మీ ముందు ఉన్నాను' అని మంత్రి సీతక్క తెలిపారు.'నేను మంత్రిగా ఉన్నప్పటికీ ఎప్పుడు నా మూలాలు మరిచిపోలేదు. ప్రజాజీవితమంటే జనంతోనే ఉండాలి. ఇప్పటికీ ప్రతివారం రెండు రోజులు.. నేను ములుగు ప్రజల మధ్యనే ఉంటాను. జనం ఎన్నుకున్నారని.. వారితోనే ఉండాలనేది నా సిద్ధాంతం. ఎమ్మెల్యే, మంత్రి కాగానే ప్రజలతో దూరంగా ఉండాలని.. అప్పుడే గౌరవం ఉ ఒంటుందని కొందరు భావిస్తారని.. కానీ నేను ఆ భావనకు పూర్తి విరుద్ధం. మేము ప్రజలకు జవాబుదారులమని.. బాసులం కాదని.. మనం సేవకులం. నాయకులకు ప్రజలే బలం. అయితే మహిళలు ఉన్నతస్థాయికి ఎదిగినా వివక్షతను ఎదుర్కొంటున్నారు. పురుష మంత్రులకు ఇచ్చినంత గౌరవం.. మహిళా మంత్రులకు ఇవ్వరు. అయినప్పటికీ మనం వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. డెడికేషన్, డిటర్మినేషన్‌తో పనిచేస్తూ పోవాలి. నా జీవితం కష్టాల కలపోత, పోరాటాలమయం. నా కష్టాలను. పోరాటాలను ఎప్పటికీ మర్చిపోను' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు: ఉత్తమ్

హైదరాబాద్: కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. "ఎల్‌నినో వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమే. రాష్ట్ర ప్రజల కష్టాలకు కారణమైన వారే ప్రస్తుతం అబద్ధాలు చెబుతున్నారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారు. బీఆర్ఎస్ పాలనలోనే మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయింది. కేసీఆర్ తీరు వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. 2025 ఏప్రిల్‌లో మేడిగడ్డపై ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ తరహాలోనే అన్నారం, సుందిళ్లలోనూ పరిస్థితి ఉందని చెప్పింది. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ప్రకారం మూడు



బ్యారేజీలను ఖాళీ చేయాలని నిర్ణయించాం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీరు నిలుపవద్దని ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయని స్పష్టం చేసింది. మూడు బ్యారేజీల్లోనూ ఫౌండేషన్‌లో లోపాలు ఉన్నాయని చెప్పింది. ఫౌండేషన్ విషయంలో డీపీఆర్‌లో ఒకటి రాశారు.. నిర్మాణంలో మరొకటి చేశారు. బ్యారేజీల నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారు. అందువల్లే సమస్యలు తలెత్తాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గేట్లు మూయవద్దని ఎన్‌డీఎస్ఏ చెప్పింది. బ్యారేజీల గేట్లు మూయకుంటే పంపులు రన్ చేసే అవకాశమే లేదు. కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి ఎంత కాంక్రీట్ అవసరమైందో.. అంత కాంక్రీట్ మరమ్మతులకు అవసరం" అని ఉత్తమ్ వివరించారు.

# సంపాదకీయం

ఆదివారం, అక్టోబర్ 25, 2026

## జలసంరక్షణే శ్రీరామరక్ష

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు లు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేకపోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి. ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి. ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక యాక్సెస్ ప్రాంతీయ వార్తలు సేవ రాష్ట్ర వార్తలు సేవ మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి..

## నిదానంగా ఎమ్మెల్సీ ఎన్నికలకోసం ఓటర్ల నమోదు

హైదరాబాద్, అక్టోబరు 24, (న్యూస్ పల్స్)తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకోసం ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతోంది. చదువుకున్న నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, ఐటీ నిపుణులు అధికంగా ఉండే రాజధాని హైదరాబాద్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. దీనికి విరుద్ధంగా, నల్గొండ- ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలో మాత్రం ఓటర్ల నమోదు ఉత్సాహంగా సాగుతోంది. నవంబర్ 6 నాటికి ఓటర్ల నమోదుకు తుది గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్ల నమోదులో విఫలమవుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ నియోజకవర్గంలో కేవలం 1,91,360 దరఖాస్తులు మాత్రమే అందగా, నల్గొండ- ఖమ్మం- వరంగల్ నియోజకవర్గంలో ఏకంగా 2,44,349 దరఖాస్తులు వచ్చాయి. హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి జిల్లాలో 53,491 దరఖాస్తులు, మేడ్చల్ లో 37,364, హైదరాబాద్ జిల్లాలో 22,535, వికారాబాద్ లో 15,020 చొప్పున నమోదయ్యాయి. ఇక రెండో నియోజకవర్గానికి వస్తే? నల్గొండలో 46,038, సూర్యాపేటలో 31,512, ఖమ్మంలో 37,848 దరఖాస్తులతో గ్రామీణ-అర్బన్ మిశ్రమ ప్రాంతాలు అగ్రస్థానంలో నిలిచాయి. 2021 ఓటర్ల జాబితాతో పోలిస్తే అప్పట్లో హైదరాబాద్ నియోజకవర్గంలో 5.31 లక్షలు, నల్గొండ నియోజకవర్గంలో 5.05 లక్షల మంది ఓటర్లు ఉండేవారు. అయితే, ప్రస్తుత గణాంకాలు కేవలం అందిన దరఖాస్తులను మాత్రమే సూచిస్తున్నాయని, ఇవి తుది ఓటర్ల జాబితా వచ్చేసరికి మారే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారుఓటర్ల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగడానికి ప్రధాన కారణం రాజకీయ పార్టీల వైఫల్యమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. పండుగ వాతావరణం, ఇతర రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్న పార్టీలు పట్టభద్రుల నమోదుపై దృష్టి పెట్టడంలో విఫలమయ్యాయి. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల పైనే దృష్టి సారిస్తుండటంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాముఖ్యతను క్రింది స్థాయి క్యాడర్‌కు చేరవేయడంలో చొరవ చూపడం లేదు. హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన నిపుణులు, ఐటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించడంలో ఉండే నిబంధనలు, అవగాహన లోపం ఓటర్ల నమోదును దెబ్బతీస్తున్నాయి. పార్టీల యంత్రాంగం బూత్ స్థాయి నుంచి పట్టభద్రులను మోబిలైజ్ చేయడంలో విఫలమవడం వల్లనే అర్హులైన లక్షలాది మంది ఓటు హక్కుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం చట్టసభల ప్రాతినిధ్యం మాత్రమే కాదు, రాబోయే రాజకీయ పరిణామాలకు ఒక రిఫరెండమ్‌గా భావిస్తారు. పట్టభద్రుల నియోజకవర్గాల్లో విజయం సాధించడం ద్వారా మేధావి వర్గం తమవెంట ఉందనే సంకేతాలను రాజకీయ పార్టీలు పంపాలనుకుంటాయి. అయితే, హైదరాబాద్ వంటి ప్రతిష్టాత్మక నియోజకవర్గంలో ఓటర్ల నమోదు పట్ల చూపుతున్న నిర్లక్ష్యం ఆయా పార్టీల బలాన్ని బలహీనపరిచే అవకాశం ఉంది. రానున్న కొద్ది రోజుల్లో పార్టీలు తమ వ్యూహాలను మార్చుకుని, అర్హులైన పట్టభద్రులతో దరఖాస్తులు పూర్తి చేయించడంలో ఎంతవరకు సఫలమవుతాయనే అంశంపైనే ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. గడువు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీలు మేలుకుని క్రియాశీలక పాత్ర పోషిస్తాయా లేదా అనేది వేచి చూడాలి.

## ఎదురుదాడులా.. లీగల్ నోటీసులా...

హైదరాబాద్, అక్టోబరు 24 (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి అనుసరిస్తున్న వ్యూహాలు తీవ్ర ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కోసం కొండపోచమ్మ సాగర్ కాలువ ద్వారా నీటిని మళ్లించారంటూ మీడియాలో వచ్చిన కథనాలు, కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలపై బీఆర్ఎస్ లీగల్ సెల్ వెంటనే రంగంలోకి దిగి లీగల్ నోటీసులు జారీ చేసింది. అంతకుముందు కూడా కేటీఆర్, హరీష్ రావుల పై ఎలాంటి ఆరోపణలు వచ్చినా.. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ వంటి అగ్రనేతలకు సైతం లీగల్ నోటీసులు పంపడమే ప్రథమ మార్గంగా ఎంచుకున్నారు. అయితే, రాజకీయ రణరంగంలో శత్రుపక్షాల బాణాలకు పదునైన రాజకీయ ఎదురుదా తో సమాధానమివ్వాల్సింది పోయి.. కోర్టుల చుట్టూ, నోటీసుల చుట్టూ తిరగడం బీఆర్ఎసను ఆత్మరక్షణ లో పడేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎదసాధారణంగా ప్రజాస్వామ్య రాజకీయంలో ప్రజల్లోకి బలంగా వెళ్లేది వ్యూహాత్మక ఎదురుదాడి మాత్రమే. ప్రత్యర్థి ఒక ఆరోపణ చేసినప్పుడు దానికి అంతే పదునైన ఆధారాలతో, మీడియా, బహిరంగ సభల వేదికగా కౌంటర్ ఇచ్చి ఆ నరేటివ్‌ను తిప్పికొట్టడమే రాజకీయ పరిణతి. కానీ బీఆర్ఎస్ నేతలు ప్రతి చిన్న విషయానికి 'కోర్టుకు వెళ్తాం, లీగల్ నోటీసులు పంపాం అనడం వల్ల.. ప్రజల్లో ఒక రకమైన భావన ఏర్పడే ముప్పు ఉంది. నోటీసులు పంపడం వల్ల ఐపీసీ, క్రమశిక్షణా పరిధిలో చట్టపరమైన రక్షణ లభిస్తుందేమో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆరోపణలు నిజమేనేమో, అందుకే మాట్లాడకుండా లీగల్ షీల్డ్ వెనుక దాక్కుంటున్నారు అనే సందేహాలకు ఆస్కారం లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో కేటీఆర్ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులకు లీగల్ నోటీసులు పంపిన ఘటనలు చూశాం. అయితే, భారతదేశంలో లీగల్ నోటీసు నోటీసుగానే మిగిలిపోయి, అవమాన నష్టపరిహారం కేసులు కోర్టుల్లో ఏళ్ల తరబడి సాగుతాయి. రాజకీయాల్లో ఎన్నికల ఫలితాలు, ప్రజాభిప్రాయం క్షణాల్లో మారిపోతుంటాయి. అలాంటప్పుడు న్యాయపరమైన నోటీసులు ఇచ్చి ప్రకటనలకు పరిమితమవ్వడం కంటే, మైక్ ముందు నిలబడి ఆధారాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తేనే పొలిటికల్ మైలేజ్ దక్కుతుంది. లీగల్ మార్గాన్ని ఆశ్రయించడం ద్వారా ఆరోపణలను మరింత కాలం వార్తల్లో సజీవంగా ఉంచినట్లవుతోందనే విమర్శలు కూడా ఉన్నాయి. బీఆర్ఎస్ వర్గాలు మాత్రం తమ లీగల్ వ్యూహాన్ని గట్టిగా సమర్థించుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని పథకం ప్రకారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చేందుకు అసత్య ప్రచారాలు చేస్తోంది అని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయంగా మీడియా సమావేశాలు పెట్టి ఎన్ని కౌంటర్లు ఇచ్చినా, సామాజిక మాధ్యమాలు, అనుకూల మీడియా ద్వారా తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నందున.. దానికి చట్టపరమైన చెక్ పెట్టడమే సరైన మార్గమని పార్టీ భావిస్తోంది. నోటీసులు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో దుష్ప్రచారం చేసేవారిలో ఒక రకమైన భయం ఏర్పడుతుందని గులాబీ నేతలు వాదిస్తున్నారు. పొలిటికల్ మైండ్ గేమ్‌లో డిఫెన్స్ ఎప్పుడూ వీక్‌నెస్‌ను సూచిస్తుంది . అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ బలహీనతలను పసిగట్టి వరుసగా ఆరోపణల వర్షం కురిపిస్తున్న వేళ.. బీఆర్ఎస్ కేవలం లీగల్ సెల్ కారెక్టర్‌కే పరిమితమైతే రాజకీయంగా తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ప్రజలు నాయకుల నుంచి పదునైన వాగ్ధాటిని, ప్రజాక్షేత్రంలో వీరోచిత పోరాటాన్ని కోరుకుంటారు తప్ప, న్యాయవాదుల కాగితపు పోరాటాలను కాదని అంటున్నారు.

## అవినీతి అధికారులకు సెక్రటేరియట్ లో లాబీయింగ్

హైదరాబాద్, అక్టోబరు 24 (న్యూస్ పల్స్)తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నెలకు సగటున 20 నుంచి 25 కేసుల వరకు నమోదు చేస్తూ లంచగొండి అధికారుల పాలిట సింహస్వప్నంగా మారుతున్నారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం, అక్రమాస్తుల కేసుల్లో దాడులు జరగడం రోజువారీ వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అయితే, అలా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన అధికారులు ఆ తర్వాత ఏమవుతున్నారు? కోర్టుల్లో శిక్షలు పడుతున్నాయా అంటే.. సచివాలయంలోని కొన్ని విభాగాల మద్దతుతో, చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని విచారణ నుంచి హాయిగా తప్పించుకుంటున్నారనే సంచలన నిజాలు బయటపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ ప్రభుత్వానికి సమర్పించిన న నివేదిక ప్రకారం.. ఏసీబీ అధికారులు విచారణ పూర్తి చేసి సచివాలయానికి ప్రాసిక్యూషన్ అనుమతి కోసం పంపినప్పుడు తీవ్ర ఆలస్యం జరుగుతోంది. ప్రత్యక్షంగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారుల కేసులను కూడా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. ఆ తర్వాత వాటిని కోర్టు విచారణ దాకా వెళ్లకుండా, నామమాత్రపు శాఖా పరమైన విచారణ లకు బదిలీ చేసి ఏసీబీ కేసులను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తున్నారు. గడిచిన కొన్నేళ్లలో ఏసీబీ విచారణ అనుమతి కోరిన 22 కేసుల్లో ప్రభుత్వం అనుమతి నిరాకరించి, కేసులను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం ఉన్న సెక్షన్ 17ం నిబంధనను ప్రభుత్వ అధికారులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. అయితే దీనిపై అక్టోబర్ 16న స్పందించిన భారత అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అధికారిక విధులు నిర్వహించడంలో తీసుకునే నిర్ణయాలకు మాత్రమే సెక్షన్ 17ం రక్షణ కల్పిస్తుంది. లంచం అడగడం లేదా తీసుకోవడం అనేది ఏ రకంగానూ అధికారిక విధి కిందకు రాదు. కాబట్టి రెడ్ హ్యాండెడ్‌గా లంచం తీసుకుంటూ పట్టుబడే అధికారులను విచారించడానికి ఎలాంటి ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సచివాలయంలో అవినీతి అధికారులను కాపాడుతున్న బలమైన లాబీ కి చెక్ పెట్టాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకులు ఎం. పద్మనాభరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మార్గదర్శకాల ప్రకారం, లంచం కేసుల్లో పట్టుబడిన అధికారులపై సెక్షన్ 17ం అనుమతి నెపంతో విచారణను నిలిపివేయకుండా ఏసీబీని నేరుగా ప్రాసిక్యూషన్‌కు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సచివాలయమే అవినీతిపరులకు రక్షణ కవచంగా మారితే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## కేంబ్రిడ్జ్ వర్సిటీలో రాజీవ్ గాంధీతో ప్రేమ ప్రయాణం: సోనియా గాంధీ

న్యూఢిల్లీ : ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో రాజీవ్ గాంధీ, సోనియా చదువుకున్నారు. ఆ వర్సిటీలో ఉన్న గ్రీక్ రెస్టారెంట్‌లో రాజీవ్ గాంధీతో తన ప్రేమ ప్రయాణం మొదలైనట్లు సోనియా గాంధీ తెలిపారు. రాజీవ్ గాంధీతో జరిగిన తన తొలి పరిచయం



గురించి ఆమె తన ఎక్స్ అకౌంట్‌లో చెప్పారు. ఇవాళ కొత్తగా సోనియా తన ఎక్స్ అకౌంట్‌ను ఓపెన్ చేశారు. దాంట్లో ఓ వీడియో పోస్టు చేశారు. ఇక తన ఆత్మకథ బిలాంగింగ్ బుక్ గురించి చెబుతూ.. నవంబర్ 10వ తేదీన ఆ పుస్తకం ఆవిష్కరణ కాబోతుందన్నారు. రాజీవ్ గాంధీతో జరిగిన ప్రేమ ప్రయాణం గురించి ఆ బుక్‌లో రాసినట్లు ఆమె చెప్పారు. విద్యార్థులుగా ఉన్న సమయంలో రాజీవ్‌తో కలిసి దిగిన ఫోటోలను కూడా సోనియా ఆ బుక్‌లో షేర్ చేశారు. ఆ రోజుల్లో ఇంగ్లండ్‌లో ఫుడ్ బాగుండేది కాదు అని, అందుకే తాను ఇటాలియన్ ఫుడ్ కోసం గ్రీకు రెస్టారెంట్‌కు వెళ్లినట్లు చెప్పారు. యురోపియన్ స్టూడెంట్స్‌తో పాటు ఇండియన్ విద్యార్థులు కూడా ఆ రెస్టారెంట్‌కు వచ్చేవారన్నారు. ఆ రెస్టారెంట్‌లోనే రాజీవ్ గాంధీ తనకు పరిచయం అయినట్లు సోనియా తెలిపారు. రాజీవ్‌ను చూడగానే తన జీవితభాగస్వామి దొరికినట్లు భావించానన్నారు. రాజీవ్‌కు కూడా తన పట్ల అదే అభిప్రాయం కలిగిందన్నారు.

## కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు!



హైదరాబాద్, అక్టోబరు 24, (న్యూస్ పల్స్)వచ్చే ఏడాది ఆరంభంలోనే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను కూడా ప్రకటించేసింది. ఎలాగైనా ఈ రెండు ఎన్నికల్లో గెలిచి, తమ పట్టు ఏమాత్రం తగ్గలేదని నిరూపించుకోవాలనుకుంటోంది. అయితే కాంగ్రెస్ ఏకపక్ష వైఖరికి నిరసనగా వామపక్షాలతో పాటు మిత్రపక్షమైన తెలంగాణ జనసమితి సొంతంగా అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు వ్యూహరచన చేస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన కాంగ్రెస్ పార్టీ, బుజ్జగింపులు మొదలుపెట్టింది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతోంది. ఈ సమయంలో జరిగే ఎలాంటి ఎన్నికలైనా ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగానే చూడాల్సి ఉంటుంది. అందుకే వీటిని అన్ని పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ కూడా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా 2028 ఎన్నికలకు గేట్ వే రెడీ చేసుకోవాలనుకుంటోంది. అందులో భాగంగానే అన్ని పార్టీలకంటే ముందే అభ్యర్థులను ఖరారు చేసేసింది. ఈ ఎన్నికలకు 77 మంది పరిశీలకులను నియమించి, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీకి సీపీఐ, తెలంగాణజన సమితి మిత్రపక్షాలుగా ఉన్నాయి. ఈ రెండు పార్టీలను సంప్రదించకుండానే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంపై ఆ పార్టీలు అసంతృప్తితో ఉన్నాయి. అందుకే ఖమ్మం- వరంగల్- నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి ఉమ్మడిగా అభ్యర్థిని దించాలనే ఆలోచనకు వచ్చాయి. ఈ ఉమ్మడి జిల్లాల్లో కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువ. కోదండరాం నేతృత్వంలోని టీజేఎస్ పార్టీకి విద్యావంతుల నుంచి ఆదరణ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. వీళ్లిద్దరికి సీపీఎం కూడా మద్దతు తెలిపే అవకాశం కనిపిస్తోంది. ఒకవేళ సీపీఎం, సీపీఐ, టీజేఎస్ ఉమ్మడిగా అభ్యర్థిని బరిలోకి దించితే కచ్చితంగా అది కాంగ్రెస్ ఓటుబ్యాంకుపై ప్రభావం చూపిస్తుంది. ఓ వైపు బీఆర్ఎస్, మరోవైపు బీజేపీ ఈ ఎన్నికల్లో గట్టిగా ఫైట్ చేసేందుకు సిద్ధమవుతు న్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకును వామపక్షా లు చీల్చితే మొదటికే మోసం రావచ్చు. పైగా ఈ జిల్లాల్లో వామప క్షాలకు గట్టి పట్టుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ ఆలస్యంగా మేల్కొంది.

## హైదరాబాద్ లో తీవ్ర వాయుకాలుష్యం..

హైదరాబాద్, అక్టోబరు 24 (న్యూస్ పల్స్)రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం స్లో పాయిజన్‌లా మారి మనుషుల ప్రాణాలు తీసేస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డి నగరాల్లో గాలి నాణ్యత క్షీణిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతాల్లో వాహనాల పొగ, పరిశ్రమల వ్యర్థాలు, రోడ్లపై లేచే దుమ్ము, ధూళి, నిరంతర నిర్మాణ కార్యకలాపాల వల్ల ఆరోగ్యకరమైన గాలి వీచడం కష్టంగా మారింది. 2025-26 వార్షిక సగటు గణాంకాల ప్రకారం, సూక్ష్మ ధూళి కణాలైన పీఎం-10 (ఖఓ-10) స్థాయిలు జాతీయ ప్రమాణాలను మించి నమోదవడంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. హైదరాబాద్‌లో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం అధికంగా కాలుష్యం నమోదు కాగా, సంగారెడ్డిలో 30 శాతం, నల్గొండలో 18.3 శాతం మేర అధికంగా నమోదవుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం, గాలిలో పీఎం-10 వార్షిక సగటు క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించరాదని నిపుణులు చెబుతున్నారు. అయితే 2025-26 లెక్కల ప్రకారం హైదరాబాద్‌లో ఈ స్థాయి 80 మైక్రోగ్రాములు ఉండగా, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పీఎం-10 వార్షిక సగటు కేవలం 15 మైక్రోగ్రాములు మాత్రమే ఉండాలి. కానీ హైదరాబాద్‌లో డబ్ల్యూహెచ్ఓ పరిమితి కంటే 5.3 రెట్లు ఎక్కువగా ఉండగా, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు అధికంగా ప్రమాదకర స్థాయిలో కాలుష్యం ఉంది. ఈ సూక్ష్మ ధూళి కణాలు శ్వాస వ్యవస్థ ద్వారా శరీరంలోకి ప్రవేశించి మా ఊపిరితిత్తులతో పాటు రక్తప్రసరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2019లో ప్రారంభించిన 'జాతీయ స్వచ్ఛ వాయు' కార్యక్రమం వల్ల హైదరాబాద్‌లో కాలుష్య తీవ్రత పోలిస్తే కొంత తగ్గినప్పటికీ, ఇప్పటికీ సాధారణ స్థాయిల కంటే 33.3 శాతం ఎక్కువగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీర్ఘకాలం ఈ కాలుష్య గాలిని పీల్చడం వల్ల తీవ్రమైన శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని చిటికా హెచ్చరిస్తోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారిపై వాయు కాలుష్యం ప్రభావం మరీ ఎక్కువగా ఉంటుంది.



# స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు..

## - మహిళలకు ఎగుమతి మార్కెటింగ్‌పై ప్రత్యేక శిక్షణ
## - జాతీయ సరస్ మేళా వేదికగా సాధికారతకు సరికొత్త ముందడుగు




కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'దీన్‌దయాల్ అంత్యోదయ యోజన – జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాలో స్వయం సహాయక సంఘాల హిళల కోసం ఎగుమతి మార్కెటింగ్‌పై శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్‌ఐఆర్‌డీపీఆర్) ఢిల్లీ శాఖకు చెందిన మార్కెటింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల ఎగుమతి మార్కెటింగ్: సవాళ్లు – అవకాశాలు అనే అంశంపై ఈ శిక్షణ జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 90 మంది ఎస్.హెచ్.జీ దీదీలు, 35 మంది రాష్ట్ర నోడల్ అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎగుమతి మార్కెటింగ్ నిపుణులు చింతలపూడి మల్లేశ్వరరావు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి శిక్షణనిచ్చారు. అలాగే ఎన్‌ఐఆర్‌డీపీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ చిరంజీ లాల్ కటారియా, రీసెర్చ్ ఆఫీసర్ సుధీర్ కుమార్ సింగ్, ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ నేషనల్ మిషన్ మేనేజర్ రాజీవ్ సింఘాల్, ఏపీ సెర్ప్ డైరెక్టర్ డాక్టర్ శివశంకర్ ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన చర్చల్లో ఎస్.హెచ్.జీ మహిళలు తాము ఎదుర్కొంటున్న మార్కెటింగ్ సవాళ్లను పంచుకోవడంతో పాటు, అంతర్జాతీయ కొనుగోలుదారులను గుర్తించడం, దళారుల ప్రమేయాన్ని తగ్గించడం, నాణ్యతను కాపాడుకోవడం వంటి అంశాలపై చర్చించారు. ప్రత్యేకించి ప్యాకేజింగ్, బ్రాండింగ్, అవసరమైన రిజిస్ట్రేషన్లు, ధృవీకరణ పత్రాలు, ఎగుమతి డాక్యుమెంటేషన్, లాజిస్టిక్స్ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. సేంద్రియ ఉత్పత్తులు, చిరుధాన్యాల ఆహారాలు, సుగంధ ద్రవ్యాలు, చేనేత వస్త్రాలు, హస్తకళల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న అపారమైన అవకాశాలను ఈ శిక్షణ నొక్కి చెప్పింది. సోషల్ మీడియా, ఈ–కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు, ట్రేడ్ ఫేర్లు, ఎస్.హెచ్.జీ ఫెడరేషన్ల ద్వారా సామూహిక మార్కెటింగ్ వంటి విభిన్న మార్గాల ద్వారా కొనుగోలుదారులను ఎలా చేరుకోవాలో వివరించారు. సామర్థ్య పెంపు, డిజిటల్ మార్కెటింగ్, స్థిరమైన మార్కెట్ అనుసంధానం ద్వారా మహిళలు ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఈ కార్యక్రమం నిరూపించింది. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

---

## సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒక ప్రమాదకర నేరస్థుడిపై పీడీ (గూండా) చట్టం ప్రయోగం



అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్: సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐ.పి.ఎస్., నాగారాజు రఘు వర్మ అలియాస్ నాగారాజు కార్తికేయ రఘు వర్మ అలియాస్ వంశీ అలియాస్ అల్లూరి విజయ రామ్ అలియాస్ కల్నల్ కార్తికేయ సింగ్ అనే ప్రమాదకరమైన నేరస్థుడిపై 'పీడీ చట్టం' (గ్రతీవజవఅ-అజవ ఱవ్వత్ఱశీఅ ాబ్షీ) ప్రయోగించారు. ఇతను ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడటంలో కుఖ్యాతి గాంచిన వ్యక్తి. భవిష్యత్తులో ఇతను మరిన్ని నేరాలకు పాల్పడకుండా నిరోధించే ఉద్దేశంతో, ఇతనిని మెడ్చల్ జిల్లాలోని చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు.

ఈ నేరస్థుడు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవాడు. హైదరాబాద్‌కు వలస వచ్చిన ప్రారంభ రోజుల్లో డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ తర్వాత, సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో నేరాల బాట పట్టాడు. ఇతను పోలీసు అధికారిగా నటిస్తూ, బాధితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని నమ్మించి వారిని మోసం చేసేవాడు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భయపెట్టి, కేసుల నుండి కాపాడతామని చెప్పి డబ్బులు వసూలు చేసేవాడు. అంతేకాకుండా, వ్యక్తులను కిడ్నాప్ చేసి, తుపాకులు చూపించి వారి వద్ద ఉన్న నగదును దోచుకునేవాడు.

2017 నుండి 2026 మధ్య కాలంలో, ఇతను మోసం, కిడ్నాప్, దోపిడీ, బలవంతపు వసూళు (వఖ్‌శీతీఱశీఅ), బెదిరింపులు మరియు ఆయుధ చట్టం (ూతీఎం ాబ్షీ, 1959) కింద నమోదైన 14 నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. గతంలో కూడా సైబరాబాద్ పోలీసులు ఇతనిపై 2021 మరియు 2024 సంవత్సరాల్లో పీడీ చట్టాన్ని ప్రయోగించారు. అయితే, జైలు నుండి విడుదలైన తర్వాత కూడా ఇతను తన నేర ప్రవృత్తిని మార్చుకోకుండా, మళ్లీ పోలీసు అధికారిగా నటిస్తూ కిడ్నాప్, దోపిడీ మరియు బలవంతపు వసూళ్లకు సంబంధించిన మరో నాలుగు కేసుల్లో నిందితుడిగా మారాడు.

తాజా కేసులకు సంబంధించి, సైబరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట పోలీసులు ఇతనిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. గతంలో తీసుకున్న నివారణ చర్యలు (గూండా ాబ్షీ) ఉన్నప్పటికీ, ఇతను పదేపదే నేరాలకు పాల్పడుతుండటాన్ని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు, మరోసారి ఇతనిపై పీడీ చట్టాన్ని ప్రయోగించి జైలులో ఉంచారు. అపరాధిగారి పేరు మరియు చిరునామా:

నాగారాజు రఘు వర్మ ఏ నాగరాజు కార్తికేయ రఘు వర్మ ఏ వంశీ ఏ అల్లూరి విజయ రామ్ ఏ కల్నల్ కార్తికేయ సింగ్, గా/శీ నాగరాజు పద్మనాభరాజు ఏ పెద్దరాజు, వయస్సు: 29 సంవత్సరాలు, ఆంధ్ర ప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా, పోదూరు మండలం, స్వస్థలం.

---

## ఎంపీటీసీ/జెడ్పీటీసీ ఎన్నికలు--2026 నామినేషన్ల పరిశీలన పూర్తి -చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల జాబితా ప్రకటన

### ఫారం--బి సమర్పణ, నామినేషన్ల ఉపసంహరణకు 27.10.2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు గడువు

### ....జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ: అక్టోబర్ 24,2026.: ఎన్.టి.ఆర్. జిల్లా పరిధిలో నిర్వహించనున్న రెండవ సాధారణ ఎంపీటీసీ / జెడ్పీటీసీ ఎన్నికలు--2026కు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియను సంబంధిత రిటర్నింగ్ అధికారులు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల జాబితాను ప్రకటించి, సంబంధిత రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించినట్లు వెల్లడించారు. జిల్లాలోని జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 110 మంది అభ్యర్థుల నుంచి 135 నామినేషన్ పత్రాలు అందినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రిటర్నింగ్ అధికారులు ఈ రోజు నిర్వహించిన నామినేషన్ల పరిశీలనలో 109 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు కాగా, ఒక అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల తరఫున పోటీ చేయదలచిన చెల్లుబాటు అయ్యే అభ్యర్థులు తమ పార్టీ అధికారిక అభ్యర్థిత్వాన్ని ధ్రువీకరించే ఫారం--బి ను అక్టోబర్ 27 మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటలలోపు సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు తమ పార్టీ గుర్తింపు, అధికారిక అభ్యర్థిత్వానికి సంబంధించిన పత్రాలను సక్రమంగా సమర్పించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిర్ణీత గడువులోపు అవసరమైన పత్రాలను సమర్పించడం ద్వారా ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల బరిలో నుంచి వైదొలగదలచిన అభ్యర్థులు తమ నామినేషన్ల ఉపసంహరణ పత్రాలను అక్టోబర్ 27 మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటలలోపు సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత సమర్పించే ఉపసంహరణ పత్రాలను స్వీకరించడం సాధ్యం కాదని తెలిపారు. అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా, అవసరమైన పత్రాలతో గడువులోపే సంబంధిత రిటర్నింగ్ అధికారులను సంప్రదించి తమ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం 27.10.2026న మధ్యాహ్నం 3.00 గంటల తర్వాత తుది పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత ఎన్నికల తదుపరి ప్రక్రియకు సంబంధించి అవసరమైన వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులు వెల్లడిస్తారని పేర్కొన్నారు. ఎంపీటీసీ / జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరూ ఎన్నికల నిబంధనలను, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, క్రమబద్ధత పాటించేలా అభ్యర్థులు ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. నామినేషన్ల పరిశీలన, ఫారం--బి సమర్పణ, నామినేషన్ల ఉపసంహరణ తదితర అంశాలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రిటర్నింగ్ అధికారులను సంప్రదించి స్పష్టత పొందాలని కలెక్టర్ సూచించారు.

---

## తాను మరణించి మరో ఇద్దరికి నేత్రదానం సుబ్బారెడ్డి కుటుంబ సభ్యుల ఆలోచన ఆదర్శనీయం



కామవరపుకోట, అక్టోబర్ 24, మండలంలోని తడికలపూడి గ్రామానికి చెందిన షిరిడి హోటల్ అధినేత కలవల సుబ్బారెడ్డి శనివారం మృతి చెందారు. సుబ్బారెడ్డి మృతి చెందినప్పటికీ వారి కుటుంబ సభ్యులు ఉదార స్వభావంతో సుబ్బారెడ్డి నేత్రాలను దానం చేశారు. విజయవాడ ఎల్.వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు తడికలపూడి వచ్చి సుబ్బారెడ్డి నేత్రాలను సేకరించి తీసుకువెళ్లారు. సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు దుఃఖంలో ఉండి కూడా మరో నలుగురికి కంటిచూపు ఇవ్వాలనే ఆలోచనతో నేత్రాలను ఇవ్వటంతో ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు వారి కుటుంబ సభ్యులను అభినందించారు. సుబ్బారెడ్డి హోటల్ యజమానిగా గ్రామంలో అందరితో కలుపుకోలుగా ఉండేవాడని స్నేహపూర్వకంగా మాట్లాడేవాడని తన మరణం పట్ల గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు

---

## వచ్చే నెలలోనే చింతలపూడి పనులు ప్రారంభం.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు, అక్టోబర్ 24:హొ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అడ్డంకులు తొలగిపోయాయని, ప్రాజెక్టు పనులు వచ్చే నెలలోనే మొదలవుతాయనీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈమేరకు శనివారంహొ మీడియోకు ఎంపీ ప్రకటన విడుదల చేశారు. సగం పైగా పూర్తయ్యి, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆగిపోయిన చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని అడ్డంకులను తొలగించుకుంటూ ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఇటీవలే కేంద్ర అటవీ పర్యావరణ శాఖ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. త్వరగా పనులు మొదలు పెట్టేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారని, వచ్చే నెలలోనే (నవంబర్) పనులు మొదలు పెడతామని చెప్పిన ఎంపీ, చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయితే, ఏలూరు జిల్లాలో దాదాపు లక్ష ఎకరాలకు కాలువల ద్వారా సాగునీరు అందుతుందని చెప్పారు. చింతలపూడి, నూజివీడు నియోజకవర్గంలోని మెట్ట ప్రాంత రైతుల భూములకుహొసమృద్ధిగా నీరు అందుతుందని, కాలువలు చెరువులు నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయనీ, తాగునీటి సమస్యలు కూడా తీరుతాయని ఎంపీ వివరించారు.

?ఒకవైపు పోలవరం ప్రాజెక్టు పనులు తుదిదశకు చేరుతున్నాయనీ, వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టు ప్రారంభించబోతున్నామని చెప్పిన ఎంపీ ఇప్పుడు చింతలపూడి ప్రాజెక్టు పనులు కూడా మొదలు పెట్టడం ఏలూరు పార్లమెంట్ ప్రజలకు శుభవార్త అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షణలో రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని ఎంపీహొ స్పష్టం చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే ఏలూరు జిల్లాలో నీటి కొరత ఉండదని తెలిపిన ఎంపీ,హొఈ ప్రాజెక్టు కల సాకారం కావడానికి కృషి చేస్తున్నహొముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, రాష్ట్రానికి అన్ని విధాలుగా సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రి నిమ్మల రామానాయుడులకు కృతజ్ఞతలు తెలియచేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ అభివృద్ధిని ప్రజలందరూ గుర్తించాలని, ఆశీర్వదించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు.

---

## నామినేషన్ల పరిశీలన కార్యక్రమం పూర్తి ఏ ఆర్ ఓ మహేంద్ర నాథ్



కామవరపుకోట, అక్టోబర్ 24,

కామవరపుకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీటీసీల ఎన్నికల నిమిత్తం నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల పరిశీలన (స్క్రూట్నీ) కార్యక్రమం పూర్తయినట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి మహేంద్రనాథ్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుండి అభ్యర్థుల నామినేషన్లను ఇరు పార్టీల అభ్యర్థుల సమక్షంలో పరిశీలన చేసినట్లు మహేందర్నాథ్ తెలిపారు. ఇందులో భాగంగా నామినేషన్ల సెట్ల పరిశీలన కోసం వచ్చే అభ్యర్థులను తడికలపూడి ఎస్సై వల్లి పద్మ ఆధ్వర్యంలో పరిశీలన చేసి కార్యాలయంలోకి పంపారు. ఇరు పార్టీల అభ్యర్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు, ఆమోదించిన వారు కార్యాలయానికి చేరుకున్నారు.

అలాగే నామినేషన్లు దాఖలు చేసిన వివిధ పార్టీల అభ్యర్థులు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పరిశీలన, ఉపసంహరణ కార్యక్రమం కోసం పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి మహేంద్రనాథ్ తెలిపారు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

---

## హనుమద్ వాహనంపై ఊరేగిన చిన వెంకన్న



ద్వారకాతిరుమల, అక్టోబర్ 24, : ఏలూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆలయంలో వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా 4 వ రోజు స్వామివారు శ్రీ రామపాదుక సమేత భరతుడు అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారు హనుమద్వాహనంపై విహరించారు. ముందుగా హనుమద్వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఉంచి ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం అర్చకులు హారతులు పట్టి ఉత్సవాన్ని ప్రారంభించారు. హనుమద్వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ద్వారకాతిరుమల పురవీధులలో విహరించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను భక్తులు దర్శించి, కర్పూర నీరాజనాలు సమర్పించారు...

## సొసైటీ మాజీ అధ్యక్షులు కొండూరు పుల్లయ్య మృతి



కామవరపుకోట, అక్టోబర్ 24, : కామవరపుకోట సొసైటీ మాజీ అధ్యక్షులు, ఆర్యవైశ్య ప్రముఖులు కొండూరు పురుషోత్తమరావు (పుల్లయ్య) శనివారం ఉదయం మృతి చెందారు. పుల్లయ్య మృతి పట్ల ఆర్యవైశ్య సంఘ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, వర్తక, వాణిజ్య వ్యాపారస్తులు, గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీలకతీతంగా పుల్లయ్య అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండేవారని పుల్లయ్య సేవలను కొనియాడారు.

## నీళ్లన్నీ వృథాగా పోతున్నయ్.. మేం కళ్లారా చూసినం : ఎమ్మెల్యే కేపీ వివేకానంద



హైదరాబాద్, కన్నెపల్లి పంప్ హౌసును బీఆర్ఎస్ నాయకుల బృందం పరిశీలించింది. ఇప్పటికైనా కన్నెపల్లి మోటర్లు ఆన్ చేసి గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి సమస్య, రైతుల సాగునీటి సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. ఈ ముఖ్యమంత్రిని ఈ ప్రభుత్వాన్ని ఒకే ఒక్కటి హెచ్చరిస్తున్నా.. ఈ నీటి సమస్య జఠిలంగా మారి మీరు పరిష్కరించకపోతే హైదరాబాద్ నగర ప్రజలందరూ వచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి దగ్గరే ఖాళీ కుండలు, ఖాళీ బిందెలతో ఇదే శాసనసభ్యులం ప్రజలందరితో కలిసి రేవంత్ రెడ్డి ఇంటి దగ్గర కూర్చుంటామని హెచ్చరిస్తున్నానన్నారు. చేతకాని దద్దమ్మ ఈ రోజు దద్దమ్మ రాజకీయాలు చేస్తున్నాడు. చీఫ్ పాలిటిక్స్ చేస్తున్నాడు.. ఇంకా కూడా కేసీఆర్ మీద దుమ్మెత్తి పోస్తున్నాడు. మీ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు అవుతోంది.. ఇంకా కూడా కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపైనా దుమ్మెత్తిపోయడమే తప్ప ఒక సమస్యకు పరిష్కారం చూపించే అడుగులేవి నీవి అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రశ్నించారు. పని చేసేటోడే లేడు.. ఇక్కడికెవరూ వచ్చేటోడే లేడు.. వచ్చి ఇసుకు ఎత్తుకొని పోయి అమ్ముకునేటోళ్లే తప్ప.. చిన్న రిపేర్ చేసేందుకు కిలో సిమెంట్ కూడా పెట్టింది లేదని అక్కడున్నవాళ్లు చెప్తున్నరు.స్థానికులను అడిగితే చిన్న సిమెంట్ కూడా పెట్టింది లేదు సార్.. నీళ్లన్నీ వృథా పోతున్నయ్. మీ కండ్ల ముందే పోతున్నయ్ చూడండి.. సార్ అంటే మేం దగ్గరుండి కళ్లారా చూసినం. కాబట్టి ఈ రోజుకూ కూడా అక్కడ రిపేర్ చేసేందుకు చర్యలు లేవు. ఈ భారతదేశంలో ఇలాంటి చవట, దద్దమ్మ ముఖ్యమంత్రి ఎవరూ లేకుండొచ్చు.. అలాంటి ముఖ్యమంత్రిఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నడు.. ప్రజలకు నరకయాతన చూపిస్తున్నడు.. ప్రజలను ఇబ్బంది పెడుతున్నడని మండిపడ్డారు. హైదరాబాద్‌లో మళ్లీ నీళ్ల ట్యాంకర్ల మాఫియా మొదలైంది. నీళ్లు లేవని, రైతులు పంటలు వేయవద్దంటూ రేవంత్ చేతగాని దద్దమ్మలా మాట్లాడుతున్నాడన్నారు. ఎల్‌నినో విపత్తుపై ఏడాది నుంచే నిపుణులు హెచ్చరించినా..మా బీఆర్ఎస్ పార్టీ ఎంతగా పోరాటం చేసినా.. కన్నెపల్లి పంపులు ఆన్ చేయకుండా, నీళ్లను తోడకుండా నిర్లక్ష్యం చేసి..ఇప్పుడేమో నీళ్లు లేవంటూ రేవంత్ తప్పించుకుంటున్నాడని ఫైర్ అయ్యారు.

## మోరంపల్లిబంజర్‌లో ముమ్మరంగా పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన



బూర్గంపహాడ్, అక్టోబర్ 24 : ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటరు నమోదు బూర్గంపహాడ్ మండలంలో బీఆర్ఎస్ నేతలు ముమ్మరంగా చేపడుతున్నారు. బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్, పీహెచ్‌సీలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందిని కలిసి అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదు చేయించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హులందరూ తమ ఓటును ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని సహ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.అదేవిధంగా పారిశ్రామికవాడ సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి అర్హత కలిగిన పట్టభద్రులు ఓటరు నమోదు చేయించుకుని ఓటు వేసే విధానంలో కీలకం కావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మోరంపల్లిబంజర్ ఉప సర్పంచ్ పొక్కుల రవి, మాజీ వార్డు సభ్యులు పద్మ, బీసీ సెల్ అధ్యక్షులు చేతుల పెద్దవీర్రాజు, మూల బాలిరెడ్డి, కురుకుంట్ల చిన్నప్పరెడ్డి, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, సారపాక యూత్ నాయకులు సోము లక్ష్మిచైతన్యరెడ్డి, చల్లకోటి పూర్ణ, చట్టు ఆంజనేయులు, దాసరి మోహన్, పంగి సురేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

## హయత్‌నగర్‌లో భూసేకరణపై ఉద్రిక్తత.. భారీగా పోలీసుల మోహరింపు

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని ఇందిరమ్మ టవర్స్ భూసేకరణ వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. సర్వే నంబర్ 255/1లో రైతుల భూముల వద్ద ప్రహరీ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేయడంతో పరిసర



ప్రాంతాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇబ్రహీంపట్నం ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారులు భూసేకరణకు సన్నద్ధమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు బలగాలను మోహరించారు.గతంలో భూసేకరణకు వచ్చిన అధికారులు, పోలీసులను స్థానిక రైతులు వెనక్కి పంపిన నేపథ్యంలో ఈసారి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. భూములకు సంబంధించిన వివాదం నేపథ్యంలో సుమారు 20 మంది బాధిత రైతులతోపాటు బీఆర్ఎస్, బీజేపీ నేతలను హౌస్ అరెస్టు చేసినట్లు సమాచారం. పోలీసుల పహారాలో భూసేకరణ ప్రక్రియకు అధికారులు సిద్ధమవడంతో ఏం జరగనుందనే ఉత్కంఠ నెలకొంది.

## కేరళ రాజ్ భవన్‌లో వెజ్ ఓన్లీ కిచెన్.. గవర్నర్ ఆదేశం.. మండిపడ్డ కాంగ్రెస్, సీపీఎం



కేరళ గవర్నర్‌గా ఓం ప్రకాష్ మాథుర్ ప్రమాణ స్వీకారం చేసి ఒక రోజు కూడా గడవక ముందే వివాదంలో చిక్కుకున్నారు. గవర్నర్ అధికారిక నివాసమైన రాజ్‌భవన్‌లో శాకాహార వంటశాల (వెజ్ ఓన్లీ కిచెన్) మాత్రమే ఉండాలంటూ ఆయన తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ, సీపీఎం మండిపడుతున్నాయి. ఓం ప్రకాష్ మాథుర్ కేరళ గవర్నర్‌గా శుక్రవారమే ప్రమాణ స్వీకారం చేశారు. అదే రోజు ఆయన తన రాజ్ భవన్‌లో శాకాహార వంటశాల మాత్రమే ఉండాలంటూ ఆదేశించారు.మాంసాహారాన్ని వండటం కానీ, వడ్డించడం కానీ చేయకూడదని ఆదేశించారు. అయితే, ఈ నిర్ణయంపై కేరళ కాంగ్రెస్ పార్టీతోపాటు, సీపీఎం, వివిధ కేరళ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఆహారపు అలవాట్ల విషయంలో వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కును హరించేలా గవర్నర్ నిర్ణయం ఉందంటూ విమర్శిస్తున్నాయి. ఈ అంశంపై కేరళకు చెందిన కాంగ్రెస్ అగ్రనేత, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. కేరళ గవర్నర్ వ్యక్తిగత ఆహారపు అలవాట్లు, అభిరుచుల్ని అందరికీ వర్తించేలా చేయడం సరికాదన్నారు. కేరళకు ఉన్న తీర ప్రాంతం దృష్ట్యా ప్రజలు చేపల్ని ఎక్కువగా తింటారని, భిన్నమైన ఆహార అలవాట్లు కలిగి ఉంటారని అన్నారు.ప్రజలు తమకు నచ్చింది తినే హక్కు కలిగి ఉన్నారని చెప్పారు. ప్రజల ఆహారపు అలవాట్లను నిషేధించే చర్యల్ని ఆమోదించబోమన్నారు. గవర్నర్ తన పదవిని ప్రజల హక్కుల రక్షణ కోసం వాడుకోకుండా.. సొంత ప్రయోజనాలకు వాడుకోవడం సరికాదని, ఈ నిర్ణయం ప్రజల ప్రాథమిక హక్కుల్ని హరించడమే అన్నారు. అయితే, ఈ అంశంపై కేరళ రాజ్‌భవన్ వర్గాలు వివరణ ఇచ్చాయి. గవర్నర్ ఆదేశాలు ఆయన కోసం సిద్ధం చేసే ఆహార పదార్థాలకు మాత్రమే వర్తిస్తుందని, కార్యాలయ సిబ్బందికి కాదని వివరించింది.

## నిరసనలను వాయిదా వేయండి.. రాహుల్ గాంధీకి ఢిల్లీ వ్యాపారుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ , భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి తలపెట్టనున్న నిరసన కార్యక్రమాలను వాయిదా వేయాలని కోరుతూ ఢిల్లీ వ్యాపారులు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. పండగ సీజన్‌లో ఈ ఆందోళనలు నిర్వహించడం వల్ల తమకు అక్షరాలా పది వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు వ్యాపారుల తరఫున ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ).. నిరసనలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది.భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు నిరసనకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.



అయితే దీపావళి పండగ సమీపిస్తున్న వేళ.. ఈ నిరసనలు వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తాయని సీటీఐ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీపావళి షాపింగ్ కోసం ప్రజలు దేశం నలుమూలల నుంచి ఢిల్లీకి వస్తారని, ఇక్కడ రూ.25 వేల కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని చెబుతోంది. అయితే పండగ సీజన్‌లో ఇలాంటి కార్యక్రమాల కారణంగా తమకు రూ.10,000 కోట్ల వరకు నష్టం వస్తుందని ఆవేదన చెందుతోంది. ఇప్పటికే అక్టోబర్‌లో జరిగిన నిరసనల వల్ల వ్యాపారులకు రూ.3000 కోట్ల మేర నష్టాలు వచ్చాయని వాపోయింది. అందుకే సీఈసీ వ్యతిరేక ర్యాలీని వాయిదా వేయాలని వర్తక సంఘం కోరింది.నవంబర్ 1న నిరసనలు నిర్వహిస్తే రామ్‌లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, బారికేడ్లు, మెట్రో స్టేషన్ల మూసివేత వంటి చర్యలు ఉంటాయని, ఇవి వ్యాపారాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ తెలిపారు. అందుకే ఈ కార్యక్రమాలను నవంబర్ 10 తరువాత చేపట్టాలని రాహుల్ గాంధీని కోరారు.

## జైష్ సంస్థతో సంబంధాలు.. ముంబైలో ఒకరి అరెస్ట్

ముంబై, అక్టోబర్ 24: పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైష్ -ఎ- మొహమ్మద్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణల కారణంగా ముంబైలో మహమ్మద్ హసన్ అబు సర్మాద్ అక్తర్ (33)ను మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దళం అరెస్ట్ చేసింది. నగరంలోని మహిమ్ ప్రాంతంలో అతడిని శనివారం అదుపులోకి తీసుకుంది. అనంతరం అతడిని విచారిస్తోంది. పాక్ ఐఎస్ఐకు చెందిన వారితో ఉన్న సంబంధాలపై అతడిని విచారిస్తుంది. అతడి సెల్



ఫోన్‌ను పరిశీలించగా.. పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.జైష్-ఎ- మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు సంబంధించిన రెచ్చగొట్టే ఆడియో క్లిప్‌లతోపాటు సోషల్ మీడియా పోస్టులను వారు గుర్తించారు. దీంతో ఏటీఎస్ కలాచౌక్ యూనిట్‌లో అతడిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సోషల్ మీడియా కార్యకలాపాలతోపాటు టెలిగ్రామ్ గ్రూప్ ద్వారా సర్మాద్ అక్తర్ కేసు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.మరో వైపు గతంలో గుజరాత్‌లో జైష్ -ఎ- మొహమ్మద్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిన ఎనిమిది మందిని ఉగ్రవాద వ్యతిరేక దళం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆ రాష్ట్రంలో వారంతా ఈ ఆ సంస్థ కోసం చురుకైన పాత్ర పోషించడంతోపాటు సభ్యులను నియమించేందుకు నెట్ వర్క్‌ను చేపట్టారు. ఆ రాష్ట్రంలో భావజాలాన్ని వారి ద్వారా వ్యాప్తి చేయడానికి వీరంతా పని చేస్తున్నారని ఉగ్రవాద వ్యతిరేక దళం వెల్లడించిన విషయం విదితమే. అందుకోసం దారుల్ ఇస్లాం గుజరాత్ జైష్ ఎ మొహమ్మద్ అనే సంస్థను వారు స్థాపించారని ఏటీఎస్ వివరించింది. ఈ ఎనిమిది మందిలో ఏడుగురు గుజరాతీలు కాగా.. ఒకరు మధ్యప్రదేశ్‌కు చెందిన వారని ఏటీఎస్ స్పష్టం చేసిన విషయం విదితమే.

## ఫిలిప్పైన్స్‌లో రెండు సైనిక విమానాలు ఢీ.. నలుగురు పైలట్లు మృతి

ఫిలిప్పైన్స్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఫిలిప్పైన్స్ సైన్యానికి చెందిన రెండు శిక్షణ విమానాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు పైలట్లు మరణించారు. ఈ ఘటన ఫిలిప్పైన్స్ రాజధాని మనీలా దక్షిణ ప్రాంతంలో ఉన్న ఎయిర్ బేస్ వద్ద శుక్రవారం జరిగింది. స్థానిక బటాంగాస్ ప్రావిన్స్‌లోని ఫెర్నాండో ఎయిర్ బేస్ సమీపంలో ఎస్ఎఫ్-260 అనే రెండు యుద్ధ విమానాలు గాలిలోనే ఢీకొన్నాయి. ఈ సమయంలో రెండు విమానాల్లో ఉన్న నలుగురు పైలట్లు మరణించారు.విమానాలు ఢీకొని ఎయిర్ బేస్ ప్రాంతంలోనే కూలిపోయాయి. ఘటన గురించి తెలిసిన వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. పైలట్ల మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నాయి. ఈ విమానాలు పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు వాడుతారు. ఈ ఘటన తర్వాత ఎస్ఎఫ్-260 యుద్ధ విమానాల్ని ఫిలిప్పైన్స్ ఎయిర్ ఫోర్స్ విభాగం నిలిపివేసింది. తాత్కాలికంగా విమాన సేవల్ని నిలిపివేసినట్లు తెలిపింది. విమాన ప్రమాదంపై విచారణ జరుగుతోందని సైనిక విభాగం వెల్లడించింది. విమానాలు ఢీకొనడానికి గల కారణాలపై దర్యాప్తు బృందం విచారణ జరుపుతోందని వివరించింది.ఈ ఘటనకు సంబంధించి పైలట్లు శిక్షణలో ఉన్నారని, వారు



మరణించడం విచారకరమని వ్యాఖ్యానించింది. ఎస్ఎఫ్-260 యుద్ధ విమానాలు గతంలో కూడా ప్రమాదాలకు గురయ్యాయి. గత మేలో ఎస్ఎఫ్-260 యుద్ధ విమానం కూలిన ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. అంతకుముందు 2023లో కూడా ఎస్ఎఫ్-260 టీపీ మార్చెట్టి అనే విమానం కూడా కూలిపోయింది.

## ఇరాన్‌పై మళ్లీ సైనికచర్య తప్పదన్న ట్రంప్.. నిప్పుతో చెలగాటమొద్దన్న ఇరాన్..!



పశ్చిమాసియా లో ఉద్రిక్తలు మళ్లీ తీవ్రస్థాయికి చేరేలా కనిపిస్తున్నాయి. ఈ వారాంతంలో ఇరాన్ పై అమెరికా భీకర దాడులు చేసే అవకాశాలున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. టెహ్రాన్ తో ఎలాంటి ఒప్పందం కుదరకపోతే తాము మరోసారి సైనికచర్యకు దిగే అవకాశం ఉందని ట్రంప్ సంకేతాలిచ్చారు. మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫ్లోరిడా ర్యాలీ లో మాట్లాడుతూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'పశ్చిమాసియాలో మరో చిన్నస్థాయి ఎపిక్ ఫ్యూరీ జరగొచ్చు' అని ట్రంప్ ఆ ర్యాలీ సందర్భంగా హెచ్చరించారు. ఈ వారాంతంలో ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశం ఉందని తుర్కియేలోని అమెరికా రాయబారి టామ్ బారక్ ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యలు చేశారు. తొలుత వాటిని ట్రంప్ తోసిపుచ్చారు. ఆ దాడుల వ్యాఖ్యల గురించి తనకేమీ తెలియదని వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు స్వయంగా ట్రంప్ కూడా దాడుల గురించి హింట్ ఇవ్వడం గమనార్హం. దాంతో పశ్చిమాసియాలో మళ్లీ పరిస్థితులు ఉత్కంఠగా మారాయి.కాగా అమెరికా హెచ్చరికల వార్తలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. నిప్పుతో చెలగాటమాడొద్దంటూ వార్నింగ్ ఇచ్చింది. తమపై మరోసారి దాడులు జరిగితే గల్ఫ్ దేశాల్లోని సముద్రగర్భంలో ఉన్న కమ్యూనికేషన్ కేబుళ్లను ధ్వంసం చేస్తామని ఇప్పటికే వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్‌పై దాడి జరిగితే ఇక ఎలాంటి హద్దులు ఉండవని.. కేబుళ్లు, మిలిటరీ స్థావరాలు వేటినీ వదలబోమని పేర్కొన్నది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరిట అమెరికా దాడులు చేసింది. అప్పటి నుంచి పశ్చిమాసియాలో ఏదో ఒక రూపంలో ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి.

## రైతులతో కలిసి ఎండిన వరి పంటతో సునీత లక్ష్మారెడ్డి ధర్నా



వెల్దుర్తి, అక్టోబర్ 24 : విద్యుత్ సమస్యలతో ఎండిపోతున్న వరి పంటలను చూసి రైతుల కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని మాసాయిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఎండిన వరి పంటను పరిశీలించిన ఎమ్మెల్యే.. బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని బ్లాక్ బుక్స్‌ను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరిశీలించారు. విద్యుత్ సరఫరా, అంతరాయాలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. విద్యుత్ సమస్యల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నాయకులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనతో రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

## అభిజీత్ దీప్కే లాంటి వాళ్లు వస్తారు.. సీజేపీ నేతపై పీయూష్ గోయల్ వ్యాఖ్యలు..



విదేశాల్లో ఉన్న భారతీయ ప్రతిభావంతులను స్వదేశానికి తిరిగి రప్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. జర్మనీలోని బెర్లిన్‌లో భారతీయ పరిశోధకులు, విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిధులతో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించే అంశాన్ని ప్రస్తావిస్తూ, సీజేపీ నేత అభిజీత్ దీప్కే పేరును ప్రస్తావించారు విదేశాల్లో ఉన్న ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, పరిశోధకులను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు చైనా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని పీయూష్ గోయల్ వివరించారు. భారతదేశం కూడా అలాంటి కార్యక్రమాలను పరిశీలించవచ్చని, అయితే ప్రజాస్వామ్య వ్యవస్థలో వాటిని అమలు చేసేటప్పుడు కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

# ఎన్నికల వివాదాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

విజయవాడ, అక్టోబరు 24 ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూహ్యమైన రాజకీయ, చట్టపరమైన సమీకరణాలు వెలుగులోకి వస్తున్నాయి. స్థానిక పోరులో నామినేషన్ల ఘట్టం నుంచి మొదలైన వివాదం ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం వరకు చేరినప్పటికీ.. అధికార కూటమి, పొలిటికల్ సర్కిళ్లలో మరో ఆసక్తికరమైన ప్రచారం నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నామినేషన్లను అడ్డుకున్నారు అనే ప్రచారాన్ని ఉద్దేశపూర్వకంగానే తీవ్రతరం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల బహిష్కరణ ప్రకటన వచ్చేలా మానసిక వాతావరణాన్ని సిద్ధం చేసుకుంటోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు సమస్యాత్మక కేంద్రాలు, మున్సిపాలిటీలలో స్థానిక అధికారులు , పోలీసులు తీసుకుంటున్న భద్రతా చర్యలే. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, అనవసర ఘర్షణలను నివారించేందుకు పోలీసులు నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, సంబంధిత అభ్యర్థులు, ప్రతిపాదకులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. అయితే, వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనేతలు తమ అనుచరగణంతో భారీ రాలీలుగా నామినేషన్ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు పోలీసులు అడ్డుకోవడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమే. కానీ, దీన్నే పక్కాగా తమకు అనుకూలంగా మలుచుకుని మా నేతలను పోలీసులు దగ్గరుండి అడ్డుకుంటున్నారు, నామినేషన్లు వేయనివ్వడం లేదు అని వైసీపీ డిజిటల్ స్పేస్‌లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తోందనేది టీడీపీ నేతల ఆరోపణ. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత వైసీపీ క్షేత్రస్థాయి యంత్రాంగం , ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్రమైన నైరాశ్యంలో కూరుకుపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మిగిలి ఉన్న కొద్దిపాటి ఉనికి కూడా తుడిచిపెట్టుకుపోతుందనే భయం నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో పోటీ చేసి ఓడిపోవడం కంటే.. ప్రభుత్వ అరాచకాలకు నిరసనగా ఎన్నికలను బహిష్కరించాం అనే నరేటివ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడమే పార్టీ ప్రతిష్టకు క్షేమకరమని వైసీపీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు పొలిటికల్ టాక్ నడుస్తోంది. మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియను వీలైనంత వివాదాస్పదం చేయడం ద్వారా తమ బహిష్కరణ నిర్ణయానికి పునాది వేసుకునే ప్రయత్నం సాగుతోందని తెలుస్తోంది. నామినేషన్లలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించడం, ఆరోపణలను మీడియా వేదికగా నిరంతరం పబ్లిసిటీ చేయడం ద్వారా.. ఎన్నికల యంత్రాంగం , పోలీసులు కూటమికి కొమ్ముకాస్తున్నారు, ఇలాంటి వాతావరణంలో ఎన్నికలు ప్రహసనంగా మారాయి అనే అభిప్రాయాన్ని బలంగా నాటాలని యత్నిస్తున్నారు. మా అభ్యర్థుల ప్రాణాలకు రక్షణ లేదు, అందుకే మేము ఈ ప్రజాస్వామ్య రహిత ఎన్నికలను బహిష్కరిస్తున్నాం అని బాహాటంగా ప్రకటించడానికి పార్టీకి ఒక బలమైన సాకు దొరుకుతుందని భావిస్తున్నారు.తమకు ప్రజా మద్దతు ఉందని, కానీ అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతూ, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, అభ్యర్థులను భౌతికంగా అడ్డుకోవడం వల్లే తాము న్యాయపోరాటం చేయాల్సి వస్తోందని వారు వాదిస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా నామినేషన్ల ప్రక్రియను సమీక్షించి గడువు పెంపును పరిశీలించాలని సూచించడమే తమ ఆరోపణలకు నిదర్శనమని వారు స్పష్టం చేస్తున్నారు. స్థానిక పోరులో సాగుతున్న ఈ యుద్ధం రాబోయే రోజుల్లో మరింత ఆసక్తికరంగా మారనుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈసీ , పోలీసులు ఎంతటి పటిష్ట భద్రత కల్పించినా, ఒకవేళ వైసీపీ నిజంగానే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తే.. అది రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రగడకు దారితీస్తుంది. నామినేషన్ల గడువు సమీపిస్తున్న కొద్దీ వైసీపీ వ్యూహం బహిష్కరణ వైపా లేక పూర్తిస్థాయి పోరాటం వైపా అనేది తేలిపోనుంది.

# లోకల్ బాడీ ఎన్నికల్లో పతాక స్థాయికి ఘర్షణలు

కర్నూలు అక్టోబరు 24 ,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల దశలోనే అభ్యర్థులను అడ్డుకోవడం, పత్రాలను బలవంతంగా లాక్కొని చించేయడం, పరస్పరం దాడులకు దిగడం వంటి ఘటనలు కలవరపెడుతున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటుండటంతో అసలు తప్పు ఎవరిదన్నది తేల్చడం కష్టంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు కూడా ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్లు చూపిస్తున్నాయి.ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. అలాంటి ప్రక్రియలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను టీడీపీ వర్గీయులు లాక్కొని చించేశారన్న వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. మరోవైపు వైసీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులపైనా దాడులు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనల్లో ఎవరు బాధితులు, ఎవరు బాధ్యులు అనే అంశాన్ని రాజకీయ వాదనల ఆధారంగా కాకుండా పూర్తి ఆధారాలతో నిర్ధారించాల్సిన అవసరం ఉంది.వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త రామకృష్ణారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 76 హింసాత్మక ఘటనలు జరిగినట్లు ఆ పార్టీ ఆరోపించింది. వీటిలో వైఎస్సార్ కడప జిల్లాలో 22, పల్నాడులో 18, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో కలిపి 11 ఘటనలు ఉన్నట్లు పేర్కొంది. అయితే ఈ ఆరోపణలను టీడీపీ ఖండిస్తోంది. ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ అనవసర వివాదాలు సృష్టిస్తోందని, ఎన్నికలను వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తోందని అధికార పార్టీ నేతలు విమర్శిస్తున్నారు.పెనుకొండ, కడప , చిత్తూరు , శ్రీకాళహస్తి , పులివెందుల వంటి ప్రాంతాల్లో నామినేషన్ల విషయంలో వివాదాలు



చోటుచేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న వీడియోలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. మరోవైపు పుంగనూరు పరిధిలోని సదుం, రాయచోటి, మాచర్ల ప్రాంతాల్లో టీడీపీ నేతలు, అభ్యర్థులపై దాడులు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. చిత్తూరులో వాకర్ సాయంతో నామినేషన్ వేసేందుకు వెళుతున్న టీడీపీ మహిళా అభ్యర్థి అరుణకు ఎదురైన పరిస్థితికి సంబంధించిన వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కర్నూలు, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో వైసీపీ శ్రేణులు టీడీపీ అభ్యర్థులను అడ్డుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో పల్నాడు, మార్కాపురం, తిరుపతి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులకు నామినేషన్ల విషయంలో ఆటంకాలు ఎదురైనట్లు ప్రచారం జరిగింది. కొన్ని ఘటనల్లో వాహనాలు ధ్వంసం కాగా, పోలీసు సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. జనసేన కార్యకర్తలపైనా కొన్ని చోట్ల వైసీపీ అభ్యర్థులను అడ్డుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి.ఈ పరిణామాలతో పోలీసుల వ్యవహారశైలిపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలంగా వ్యవహరించడం లేదని ఇరు పార్టీల నేతలు పరస్పరం ఆరోపించుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నె కొత్తపల్లిలో నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థులను అనుమతించే విషయంలో వివాదం తలెత్తినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో కొందరికి గాయాలైనట్లు కూడా పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పూర్తి వివరాలు, అధికారిక నిర్ధారణ అవసరం. మొత్తంగా చూస్తే, స్థానిక ఎన్నికలు రాజకీయ ఆధిపత్య పోరుకు వేదికగా మారుతున్నాయి. ఏ పార్టీకి బలం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఏ పార్టీకి చెందిన వారైనా నామినేషన్లను అడ్డుకోవడం, దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమే. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడమే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే మార్గం.

## పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల పర్వం

**పోటాపోటీగా నామినేషన్లు వేసిన ఎంపీటీసీ అభ్యర్థులు.**

**మండల వ్యాప్తంగా 77 నామినేషన్లు దాఖలు.**

తుగ్గలి: తుగ్గలి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మూడవ రోజు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ప్రారంభమైంది. నామినేషన్లకు చివరి రోజు అయిన మూడవ రోజున మండల వ్యాప్తంగా మొత్తం 19 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శేషయ్య తెలిపారు.ఇందులో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు 05 మంది,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 10 మంది,ఒక జనసేన అభ్యర్థి,03 సిపిఐ అభ్యర్థులు ఉన్నారనీ రిటర్నింగ్ అధికారి తెలియజేశారు.ఉదయం నుంచే నామినేషన్ కేంద్రానికి అభ్యర్థులు తమ అనుచరులతో తరలివచ్చి నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీల మద్దతుదారుల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లుగా నామినేషన్లు కొనసాగాయి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.300 మీటర్ల పరిధిలోపు ఎంపీటీసీ అభ్యర్థులను మరియు బలపరిచే వ్యక్తులను తప్ప ఎవరిని అనుమతించలేదు.నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని,ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లను పరిశీలిస్తామని రిటర్నింగ్ అధికారి శేషయ్య తెలిపారు.నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు అడిషనల్ ఎస్పి కృష్ణమోహన్ అటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ రూరల్ సీఐ పెద్దయ్య నాయుడు, తుగ్గలి ఎస్సై బాల నరసింహులు, జొన్నగిరి ఎస్సై మల్లికార్జున లు తమ పోలీస్ సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ విశ్వ మోహన్,రవి తదితరులు పాల్గొన్నారు.

## నందవరం మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ

నందవరంమండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలో ఎంపీటీసీ 17 స్థానాలుకు గాను మొత్తం 95 నామినేషన్లు తెలుగుదేశం పార్టీ వైయస్సార్ పార్టీ ,జనసేన పార్టీ , బిజెపి, స్వతంత్ర అభ్యర్థి , కాంగ్రెస్ పార్టీ ,సిపిఐ సిపిఎం దాఖలైనట్లు సమాచారం.నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రక్రియ ముగిసింది.ఎన్నికల బరిలో నిలిచేందుకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు.నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో తదుపరి ఎన్నికల కార్యక్రమాలపై అభ్యర్థులు,రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## నామినేషన్ కేంద్రాల్లో పటిష్ట చర్యలు

రాయచోటి, అన్నమయ్య జిల్లా పరిధిలోని కలకడ, సంబేపల్లి, ఎల్.ఆర్.పల్లి, రామాపురం, గాలివీడు మండలాల్లో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సంబంధిత అధికారులు, పోలీసు అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటితో ముగియనున్న నేపథ్యంలో రామాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లు, కేంద్రం వద్ద భద్రతా చర్యలను సమీక్షించారు.నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం, పూర్తి పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని పోలీసు సిబ్బందికి సూచించారు.ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.అన్నమయ్య జిల్లాలో రెండో సాధారణ ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి, నామినేషన్లు దాఖలు చేయకుండా ఎవరైనా తమను అడ్డుకున్నట్లు భావించే వ్యక్తులు, తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శుక్రవారం కోరారు.రాష్ట్ర ఎన్నికల సంఘం నేడు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు. నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేసినట్లయితే, సంబంధిత అధికారులు ఆ ఫిర్యాదులను పరిశీలించి, ఫిర్యాదుదారులను వెంటనే ఫోన్ ద్వారా సంప్రదించి, నిర్దేశిత గడువు సాయంత్రం 5.00 గంటలలోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహకారం అందించాల్సి ఉంటుందని తెలిపారు.కంట్రోల్ రూమ్ నెంబర్ 08571-293001 ఫోన్ చేయాలని వివరించారు.

## బేకరీలు, స్వీట్ షాపుల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

**నిల్వ ఉన్న ఆహార పదార్థాల సేకరణ**

**ల్యాబ్ పరీక్షల అనంతరం చర్యలు**

**నాణ్యత లేని, కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు**

తాండూర్:తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ ప్రాంతంలో ఉన్న బేకరీలు, స్వీట్ షాపుల్లో శుక్రవారం మంచిర్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి జి. మహేష్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేకరీల తయారీ కేంద్రాలను పరిశీలించి, అక్కడ నిల్వ ఉన్న ఆహార పదార్థాలను సేకరించారు. సేకరించిన నమూనాలను పరీక్షల నిమిత్తం ప్రయోగశాలలకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.ల్యాబ్ పరీక్షల నివేదికలు వచ్చిన అనంతరం నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన బేకరీలు, స్వీట్ షాపులపై తగిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి జి. మహేష్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేకరీల నిర్వాహకులు, యజమానులు నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే తయారు చేసి విక్రయించాలని సూచించారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయడంతో పాటు, వాటి నాణ్యత, నిల్వ కాలం విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయించడం, నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు కలిగించే విధంగా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత దుకాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## టూ టైర్ సిటీస్ లోకి క్విక్ కామర్స్

కర్నూలు, అక్టోబరు 24 ఇ-కామర్స్ సేవలు వేగంగా విస్తరిస్తుండటం, క్విక్ కామర్స్ సంస్థల మధ్య పోటీ పెరగడంతో ప్రముఖ లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ దిగ్గజాలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. కేవలం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై వంటి మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల సరిహద్దుల్లో భారీగా భూములను సమీకరించే పనిలో పడ్డాయి. జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న వ్యూహాత్మక ప్రాంతాల్లో వందలాది ఎకరాలను సుదీర్ఘ కాలానికి లీజుకు తీసుకోవడం లేదా డెవలప్‌మెంట్ ఒప్పందాలు కుదుర్చుకోవడం గత వారంలో గణనీయంగా పెరిగింది.ఈ నూతన ధోరణిలో ప్రధానంగా జాతీయ రహదారుల జంక్షన్లు, ఇండస్ట్రియల్ కారిడార్లు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, నల్గొండ, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు వంటి ప్రధాన పట్టణాల బైపాస్ రోడ్లకు సమీపంలో ఉన్న ల్యాండ్ పార్సెల్స్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. పక్కా రవాణా సదుపాయాలు, తక్కువ ధరకే లభించే భూమి, చౌకగా లభించే స్థానిక కార్మికులు ఈ నగరాల వైపు గ్లోబల్ లాజిస్టిక్స్ సంస్థలను ఆకర్షించడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.టైర్-2, టైర్-3 ప్రాంతాల్లో నివసించే వినియోగదారులకు కూడా సేమ్ డే డెలివరీ, దా కొన్ని గంటల వ్యవధిలోనే సరుకులను అందజేయాలనే లక్ష్యంతో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇక్కడ ప్రాంతీయ పంపిణీ కేంద్రాలను , గ్రేడ్-ఎ వేర్‌హౌసింగ్ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా సప్లై చైన్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని లాజిస్టిక్స్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. దీనివల్ల వస్తువుల రవాణా మరింత వేగవంతం కానుంది.వేర్‌హౌసింగ్ దిగ్గజాల నుంచి వస్తున్న ఈ భారీ డిమాండ్ కారణంగా టైర్-2, టైర్-3 నగరాల సరిహద్దుల్లో ఉన్న భూముల విలువలు ఒక్కసారిగా రెక్కలు తొడిగాయి. ఒకప్పుడు కేవలం వ్యవసాయానికే పరిమితమైన హైవే పక్క భూములకు ఇప్పుడు కమర్షియల్ లీజుల రూపంలో స్థానిక భూయజమానులకు భారీగా క్రమం తప్పని ఆదాయం సమకూరుతోంది. ఈ పరిణామం ద్వితీయ శ్రేణి నగరాల్లో స్థానిక ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా, ఆ ప్రాంతాల రియల్ ఎస్టేట్ ముఖచిత్రాన్ని వేగంగా మార్చివేస్తోందని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## టీడీపీ కంటే వైసీపీ ఎక్కువ నామినేషన్లు

నెల్లూరు, అక్టోబరు 24 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదంటూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధికార కూటమి అడ్డంకులు సృష్టిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని గగ్గోలు పెడుతున్న జగన్ నాటకాలను అధికారిక లెక్కలే బట్టబయలు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా దాఖలైన నామినేషన్ల సంఖ్యను పరిశీలిస్తే, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏ స్థాయిలో పోటీలో ఉన్నారో, కొన్నిచోట్ల కూటమి కంటే ఎక్కువ సంఖ్యలోనే నామినేషన్లు వేసి హోరాహోరీగా రేసులో నిలిచారో స్పష్టమవుతోంది.రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు గానూ మొత్తం 32,095 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకంగా 12,419 నామినేషన్లు వేయగా, తెలుగుదేశం పార్టీ తరఫున 15,017 మంది నామినేషన్లు సమర్పించారు. జనసేన నుంచి 2,073, బీజేపీ నుంచి 562 నామినేషన్లు వచ్చాయి. ఇక జెడ్పీటీసీల విషయానికొస్తే.. 659 స్థానాలకు మొత్తం 2,805 నామినేషన్లు పడగా, వైఎస్సార్‌సీపీ నుంచి అత్యధికంగా 1,092 మంది పోటీలో నిలిచారు. అధికార టీడీపీ తరఫున 1,055 మంది మాత్రమే నామినేషన్లు వేయగా, జనసేన నుంచి 178, బీజేపీ నుంచి 111 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాన స్థానాల్లో టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీ నేతలే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేయడం వారి ఫేక్ ప్రచారాన్ని బట్టబయలు చేసింది.తమ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అక్రమాలను, దౌర్జన్యాలను గుర్తుచేసుకుంటూ ఇప్పుడు అధికార కూటమిపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2020లో జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక పోరులో వైఎస్సార్‌సీపీ బలవంతపు ఏకగ్రీవాలతో రికార్డు సృష్టించింది. నాడు పట్టణ ప్రాంతాల్లో 20.72 శాతం స్థానాలను ఏకగ్రీవం చేసుకోగా, గ్రామీణ ప్రాంతాల్లో 24 శాతం ఎంపీటీసీలు, 19 శాతం జెడ్పీటీసీలను ప్రతిపక్షాలను బెదిరించి, భయాందోళనలకు గురిచేసి బలవంతంగా చేజిక్కించుకున్నారు. నాడు జరిగిన విధ్వంసాలు, దాడులతో గొడవలు సృష్టించి సాధించిన ఏకగ్రీవాలనే తమ గొప్ప విజయాలుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం చేసుకుంది.కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయి. ప్రతిపక్ష అభ్యర్థులకు పూర్తి స్వేచ్ఛ ఉండటం వల్లే భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు కావడం సాధ్యమైంది. వైఎస్సార్‌సీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే కెమెరాల ముందు నాటకాలు ఆడుతూ, ఫేక్ వీడియోలతో నేషనల్ మీడియాను, ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారనేది ఈ అధికారిక గణాంకాలతో స్పష్టంగా నిరూపణైంది. ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ వర్గం ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్ముకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## బొత్స రూటే వేరు...

విజయనగరం. అక్టోబరు 25,ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కీలక కేంద్రమైన విజయనగరం జిల్లా పరిషత్ పీఠాన్ని దక్కించుకునేందుకు బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్థానాన్ని ఎలాగైనా తమ ఖాతాలోనే ఉంచుకోవాలనే పట్టుదలతో, బొత్స తన సొంత కుటుంబ సభ్యులనే రేసులో నిలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో ప్రధానమైన నాలుగు కీలక నియోజకవర్గాల నుంచి తన కుటుంబీకులతో నామినేషన్లు వేయించారు.జెడ్పీ పీఠంపై కుటుంబ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు బొత్స సత్యనారాయణ పక్కా ప్రణాళికతో అభ్యర్థులను ఖరారు చేశారు. బొండపల్లి జెడ్పీటీసీ స్థానం నుంచి ఆయన కుమార్తె, భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ బొత్స అనూష నామినేషన్ దాఖలు చేశారు.అలాగే గరివిడి నుంచి కోడలు బొత్స పూజిత, గుర్ల స్థానం నుంచి సోదరి వెంకటలక్ష్మి, పూసపాటిరేగ జెడ్పీటీసీ స్థానం నుంచి సోదరుడి కుమారుడు బొత్స చైతన్య బరిలోకి దిగారు. ప్రధానంగా జెడ్పీ చైర్‌పర్సన్ స్థానానికి బొత్స అనూషను రేసులో నిలిపేందుకే ఈ ముందస్తు ఏర్పాటు చేశారనే ప్రచారం బలంగా జరుగుతోంది.జిల్లా పరిషత్ పీఠం చేజారకుండా చూసుకునేందుకే బొత్స కుటుంబం నాలుగు వైపుల నుంచి వ్యూహాత్మకంగా రంగంలోకి దిగినట్లు స్పష్టమవుతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసి అధికార కూటమిలోకి వెళ్లడం వైఎస్సార్‌సీపీకి పెద్ద షాక్‌గా మారింది.

# స్పోర్ట్స్ న్యూస్

## భారత జట్టులోకి కుమార్ కుశాగ్రా.. ఇషాన్ కిషన్ స్థానంలో..



న్యూజిలాండ్‌తో జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. తొలి టీ20 మ్యాచ్‌లో తొడ కండరాల నొప్పి కారణంగా యంగ్ ప్లేయర్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం బీసీసీఐ వైద్య బృందం అతడిని పర్యవేక్షిస్తుందని బోర్డు కార్యదర్శి దేవాజిత్ సైకియా తెలిపారు. మరోవైపు ఇషాన్‌కి ప్రత్యామ్నాయంగా యంగ్ వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్రా టీమిండియాలోకి ఎంపికయ్యాడు.ప్రస్తుతం క్రైస్ట్‌చర్చ్‌లో ఇండియా 'ఎ' జట్టుతో ఉన్న కుశాగ్రా త్వరలోనే ప్రధాన జట్టుతో కలవనున్నాడు. తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్‌కు గాయం కావడం వల్లే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాల్సి వచ్చిందని భారత బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కొటక్ వెల్లడించారు. ఇషాన్ కనీసం ఒక మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం రెండో టీ20కి మాత్రమే కుశాగ్ర ఎంపికయ్యాడు. తదుపరి మ్యాచులకు మార్పులు జరుగనున్నాయి.మరోవైపు ఇషాన్ కిషన్ స్థానంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తుది జట్టులోకి అడుగుపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆసియా క్రీడల ఫైనల్ తర్వాత వైభవ్ మళ్లీ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. తాజాగా వెస్టిండీస్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లోనూ బెంచ్‌కే పరిమితమైన ఈ యువ ఆటగాడికి ఇప్పుడు కీలక అవకాశం దక్కే ఛాన్స్ ఉంది. కిషన్ స్థానాన్ని భర్తీ చేస్తూ జట్టు విజయాల్లో వైభవ్ ఏ విధంగా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

## చరిత్ర సృష్టించిన భారత సంతతి బాలిక శివానందన్!

చెస్‌లో భారత సంతతి బ్రిటన్ బాలిక బోధన శివానందన్ (11) చరిత్ర సృష్టించింది. ఇంటర్నేషనల్ మాస్టర్ (ఎం) హోదాను దక్కించుకున్న అతి పిన్నవయస్కురాలైన అమ్మాయిగా శివానందన్ రికార్డు సృష్టించింది. కేవలం 11 ఏళ్ల 7 నెలల16 రోజుల వయసులోనే ఈ ఘనతను సాధించింది. గతంలో ఈ రికార్డు చెస్ దిగ్గజం జుడిత్ పోల్గర్ పేరిట ఉండేది. 1988లో జుడిత్ పోల్గర్ ఈ అరుదైన ఘనత సాధించగా... దాదాపు 60 ఏళ్ల తర్వాత తాజాగా బోధన బద్దలు కొట్టింది. నెల క్రితం అతి పిన్న వయసులో ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) ఘనతను సాధించిన బోధన.. తాజాగా ఐఎం సాధించడం ద్వారా మరో మైలురాయిని అందుకుంది.మొత్తం చెస్ చరిత్రలో (మహిళలు, పురుషులు కలిపి) ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించిన అతి పిన్న వయస్కుల్లో ఈ భారతీయ-బ్రిటన్ అమ్మాయి ఏడో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో బోధన.. భారత స్టార్ ప్లేయర్ గుకేశ్(9వ స్థానం) రికార్డును కూడా వెనక్కి నెట్టింది. లండన్‌లోని హారోలో పెరిగిన బోధన.. పాఠశాల విద్యతో పాటు చెస్‌ను సమన్వయం చేసుకుంటూ ఈ అద్భుత విజయాన్ని సాధించడం




విశేషం.బోధన తల్లిదండ్రులు తమిళనాడులోని తిరుచ్చి జిల్లాకు చెందినవారు. ఉపాధి నిమిత్తం 2007లో యూకేకి వలస వెళ్లగా.. లండన్‌లో జన్మించిన బోధన ఐదేళ్ల వయసులోనే చెస్ బోర్డుతో పరిచయం ఏర్పరచుకుంది. ఆ తర్వాత క్రమంగా ఆటపై మక్కువ పెంచుకుని అంచెలంచెలుగా ఎదిగింది. తన అతితక్కువ కెరీర్‌లో ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ (డబ్ల్యూఐఎం), ఉమెన్ ఫైడ్ మాస్టర్ (డబ్ల్యూఎఫ్ఎం) వంటి రికార్డులతో పాటు, గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన అతి పిన్న వయస్కురాలిగానూ ఆమె గుర్తింపు తెచ్చుకుంది. రాబోయే రోజుల్లో తాను గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్ కూడా సాధిస్తానని బోధన ధీమా వ్యక్తం చేసింది. ఈ చిన్నారి విజయాలపై క్రీడా ప్రముఖులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

## ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా కీరన్ పోలార్డ్




ముంబై: ముంబై ఇండియన్స్ టీ20 జట్టుకు హెడ్‌కోచ్‌గా కీరన్ పోలార్డ్ నియమితుడయ్యాడు. ఐపీఎల్ 2027 సీజన్ నుంచి వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఆ బాధ్యతలను నిర్వర్తించనున్నాడు. గతంలో ప్లేయర్‌గా, బ్యాటింగ్ కోచ్‌గా ముంబై ఇండియన్స్‌కు పోలార్డ్ సేవలు అందించాడు. ఇక నుంచి అతను ప్రధాన కోచ్‌గా తన విధులను చేపట్టనున్నాడు. హెడ్ కోచ్ బాధ్యతల నుంచి మహేళ జయవర్ధనే తప్పుకోవడంతో.. అతని స్థానంలో పోలార్డ్‌కు పదోన్నతి కల్పించారు. ప్లేయర్ నుంచి కోచ్ స్థాయికి పోలార్డ్ ఎదిగినట్లు ముంబై జట్టు తన ప్రకటనలో పేర్కొన్నది. 2009-2010 సీజన్ నుంచి 2022 సీజన్ వరకు అతను ముంబై జట్టులో ప్లేయర్‌గా కొనసాగాడు. ఐపీఎల్‌లో ముంబై తరపున 189 మ్యాచ్‌లు ఆడిన పోలార్డ్ .. వాటిల్లో 147.32 స్ట్రయిక్ రేట్‌తో 3412 రన్స్ చేశాడు. అతని బ్యాటింగ్ యావరేజ్ 28.67గా ఉన్నది. అతని ఖాతాలో 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో అతను 69 వికెట్లు తీసుకున్నాడు. కెరీర్ బెస్ట్ 4-44గా ఉంది.22 ఏళ్ల వయసులో పోలార్డ్ ముంబై జట్టులో చేరాడని, 16 ఏళ్లుగా అతను తమ కుటుంబంలో సభ్యుడిగా మారారని, ప్లేయర్‌గా ఎన్నో అద్భుత క్షణాలను అందించాడని, కోచ్‌గా తన అనుభవాలను పంచాడని, హెడ్‌కోచ్‌గా ఇప్పుడు పోలార్డ్ కొత్త బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని ముంబై ఇండియన్స్ జట్టు కో-ఓనర్ నీతా అంబానీ తన ప్రకటనలో పేర్కొన్నారు. హెడ్‌కోచ్ బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నట్లు పోలార్డ్ తెలిపాడు.

## ఓడిపోయే మ్యాచ్‌లో టీమిండియాను గెలిపించిన తెలుగోళ్లు!

న్యూజిలాండ్ పర్యటనలో భారత్ జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా క్రైస్ట్‌చర్చ్ వేదికగా శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.తెలుగు తేజాలు తిలక్ వర్మ(26 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 51 నాటౌట్), నితీష్ కుమార్ రెడ్డి(13 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 26 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో అదిరిపోయే విజయాన్ని అందించారు. ఓటమి ఖాయమనుకున్న ఈ మ్యాచ్‌లో 69 పరుగుల అజేయ భాగస్వామ్యంతో గట్టెక్కించారు. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. గ్లేన్ ఫిలిప్స్(43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 70), బెవాన్ జాకోబ్స్(46 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 58) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(2/33) రెండు వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్(1/50), ప్రిన్స్ యాదవ్(1/30), నితీష్ కుమార్ రెడ్డి(1/31)తలో వికెట్ పడగొట్టారు.అనంతరం భారత్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 181 పరుగులు చేసి గెలుపొందింది. తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డితో పాటు నమన్ ధీర్(17 బంతుల్లో ఫోర్లు, 2 సిక్స్‌లతో 31) రాణించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్(4/21) నాలుగు వికెట్లు తీయగా.. జాకోబ్ డఫీ, నాథన్ స్మిత్ తలో వికెట్ తీసారు.181 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. తొలి వికెట్‌కు 40 పరుగులు జోడించిన అనంతరం సంజూ శాంసన్(14) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఇషాన్ స్థానంలో బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ(4) తీవ్రంగా నిరాశపర్చాడు. దాంతో భారత పరుగుల వేగం తగ్గింది. దూకుడుగా ఆడే క్రమంలో అభిషేక్ శర్మ(27) ఔటవ్వగా.. శ్రేయస్ అయ్యర్(7) సాంట్నర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. డారిల్ మిచెల్ అద్భుతమైన రిలే క్యాచ్‌కు అక్షర్ పటేల్(11) వెనుదిరగడంతో భారత్ 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ పరిస్థితుల్లో నమన్ ధీర్, తిలక్ వర్మ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా నమన్ ధీర్ భారీ సిక్సర్లతో బ్యాటర్లపై ఒత్తిడి తగ్గించాడు. కానీ అతన్ని సాంట్నర్ ఔట్ చేయడంతో భారత్ ఓటమి ఖాయమని అంతా అనుకున్నారు. కానీ నితీష్ రెడ్డి సాయంతో తిలక్ వర్మ జట్టును విజయం దిశగా నడిపాడు. జాకోబ్ డఫీ వేసిన 17వ ఓవర్‌లో నితీష్ రెడ్డి సిక్స్ బాదదగా.. తిలక్ వర్మ రెండు బౌండరీలు కొట్టి 17 పరుగులు పిండుకున్నాడు. ఈ ఓవర్‌తో భారత్‌కు మూమెంటమ్ లభించింది.



## ప్రపంచ రికార్డు.. ఫీల్డింగ్‌లో తిలక్ వర్మ సంచలనం



భారత యువ క్రికెటర్ తిలక్ వర్మ సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టీ20లో ఓ అరుదైన ఘనతను అందుకున్నాడు. అయితే ఈ రికార్డు బ్యాటింగ్‌లో కాదు.. ఫీల్డింగ్ కావడం విశేషం. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాడిగా తిలక్ వర్మ చరిత్ర సృష్టించాడు.మ్యాచ్ ఆరంభంలోనే న్యూజిలాండ్ బ్యాటర్లు టిమ్ సీఫర్ట్, డారిల్ మిచెల్ ఇచ్చిన క్యాచ్‌లను తిలక్ అందుకున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సీఫర్ట్‌ను, భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో మిచెల్‌ను పెవిలియన్‌కు పంపడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ రెండు క్యాచ్‌లతో ఈ ఏడాది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో తిలక్ ఖాతాలో మొత్తం 26 క్యాచ్‌లు చేరాయి. దీంతో ఇండోనేషియా ఆటగాడు డానిల్సన్ హోవే పేరిట ఉన్న 25 క్యాచ్‌ల రికార్డును తిలక్ అధిగమించాడు.ఇక మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. 181 పరుగుల లక్ష్య ఛేదనకి దిగిన భారత్.. ఈ వార్త రాసే సమయానికి 7 ఓవర్లకు భారత్ 2 వికెట్ల నష్టానికి 47 పరుగులు చేసింది. సంజు శాంసన్(14), వైభవ్ సూర్యవంశీ(4) పూర్తిగా నిరాశపర్చారు.

## న్యూజిలాండ్‌తో రెండో టీ20: భారత్ టార్గెట్ ఎంతంటే?



క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్-భారత్ జట్లు రెండో టీ20లో తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. భారత్‌కు 181 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. గ్లెన్ ఫిలిప్స్(70; 43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), జాకబ్స్(58; 46 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలు చేశారు. మిగతా బ్యాటర్లంతా స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరారు.ఓపెనర్ టిమ్ సీఫర్ట్(7), ఫిన్ అలెన్(16), డారెల్ మిచెల్(6), మిచెల్ శాంట్నర్(4×), బ్రేస్‌వెల్(10) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 2, భువనేశ్వర్ కుమార్, ప్రిన్స్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి తలొక వికెట్ పడగొట్టారు. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 1-0 తేడాతో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే.

## జయవర్ధనే స్థానంలో కీరన్ పొలార్డ్.. ముంబై ఇండియన్స్ కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు..




ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. జట్టు కొత్త ప్రధాన కోచ్‌గా వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్‌ను నియమించింది. ఇప్పటివరకు ముంబై జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించిన పొలార్డ్‌కు ప్రధాన కోచ్ బాధ్యతలు అప్పగించింది. ఇటీవల మహేల జయవర్ధనే హెడ్ కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో ముంబై ఇండియన్స్ ఈ నిర్ణయం తీసుకుంది ముంబై ఇండియన్స్‌తో పొలార్డ్ కు సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆటగాడిగా ఆ జట్టు తరఫున ఎన్నో విజయాల్లో పొలార్డ్ కీలక పాత్ర పోషించాడు. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. తాజాగా ప్రధాన కోచ్‌గా పదోన్నతి పొందాడు. ముంబై ఇండియన్స్ జట్టు సంస్కృతి, ఆటగాళ్ల సామర్థ్యాలు, ఐపీఎల్ పోటీ తీరుపై పొలార్డ్‌కు మంచి అవగాహన ఉంది. ఆటగాడిగా, బ్యాటింగ్ కోచ్‌గా సంపాదించిన అనుభవం కొత్త బాధ్యతల్లో ఉపయోగపడుతుందని జట్టు యాజమాన్యం భావిస్తోంది.ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా మహేల జయవర్ధనే తన బాధ్యతల నుంచి అక్టోబర్ 17న తప్పుకున్నాడుదీంతో 2027 సీజన్‌కు ముందు జట్టు కొత్త కోచ్‌ను నియమించాల్సి వచ్చింది. జయవర్ధనే గతంలో 2017 నుంచి 2022 వరకు ముంబై ఇండియన్స్‌కు ప్రధాన కోచ్‌గా వ్యవహరించాడు. జయవర్ధనే ఆధ్వర్యంలో ముంబై జట్టు 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు సాధించింది. 2024లో తిరిగి ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముంబై 2025లో క్వాలిఫయర్-2 వరకు చేరింది. అయితే, 2026 సీజన్‌లో జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.

## భువనేశ్వర్ కుమార్ రీఎంట్రీపై దినేశ్ కార్తీక్ కీలక వ్యాఖ్యలు..

దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చిన సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు తొలి మ్యాచ్‌లోనే నిరాశ ఎదురైంది. న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన తొలి టీ20 మ్యాచ్ ద్వారా భువీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలో అద్భుతమైన ప్రదర్శన కనబరచడంతో, 2022 తర్వాత మళ్లీ భారత జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అయితే, అతని రీఎంట్రీ మ్యాచ్ మాత్రం ఆశించిన స్థాయిలో సాగలేదు.ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ తన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 49 పరుగులు సమర్పించుకుని వికెట్లేమీ పడగొట్టలేదు. ముఖ్యంగా అతను రెండు నో-బాల్స్ వేయడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఈ నేపథ్యంలో భువీ రీఎంట్రీపై టీమిండియా మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సాధారణంగా భువీ నో-బాల్స్ వేసే బౌలర్ కాదని, మ్యాచ్‌లో ఒత్తిడి లేదా శారీరకంగా తాను పూర్తిగా సిద్ధంగా లేకపోవడం వల్లే ఇది జరిగి ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. తొలి, ఆఖరి ఓవర్లు బాగానే వేసినప్పటికీ, మధ్యలో వేసిన ఓవర్లలో



నో-బాల్స్ రావడం వల్ల భారీగా పరుగులు వచ్చాయని కార్తీక్ తెలిపాడు. న్యూజిలాండ్ మ్యాచ్‌లో భువీ తన స్థాయి ఆట ఆడలేదని ఈ మాజీ క్రికెటర్ అభిప్రాయపడ్డాడు.అయితే ఒకవైపు భువీని విమర్శిస్తూ, మరోవైపు అతడికి మద్దతుగా నిలిచాడు. ఒకే మ్యాచ్‌తో సీనియర్ ఆటగాడిని అంచనా వేయవద్దని, అభిమానులు భువీకి కాస్త మద్దతుగా నిలవాలని కార్తీక్ కోరాడు. సుమారు నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్నందున అతనికి కొంత సమయం ఇవ్వాలని సూచించాడు. భువనేశ్వర్ తన తప్పులను సరిదిద్దుకుని తదుపరి మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తాడని క్రీడా విశ్లేషకులు కూడా భావిస్తున్నాడు.

# సినిమా

## 'రణబాలి" సినిమాతో నా రాయలసీమ రుణం తీర్చుకున్నా - హీరో విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహించారు. రశ్మిక మందన్న హీరోయిన్ గా నటించారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మించారు. ఈ రోజు వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన "రణబాలి" సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తూ బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ నేపథ్యంలో అనంతపురంలో "రణబాలి" రణభేరి ఈవెంట్ గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో




కో ప్రొడ్యూసర్ అనురాగ్ పర్వతనేని మాట్లాడుతూ - ఈ రోజు మా రణభేరి ఈవెంట్ కు భారీ సంఖ్యలో వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మా రణబాలి సినిమాకు ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మన సినిమా జనాల్లో ఉంది అని మా డిస్ట్రిబ్యూటర్ శశి గారు, మా ప్రొడ్యూసర్ రవి గారు చెప్పడం సంతోషంగా ఉంది. అన్నారు.

నటి ఈశ్వరీరావు మాట్లాడుతూ - వందలమంది కష్టపడితే దక్కిన విజయం ఇది. ఎవరెన్ని నెగిటివ్ ప్రచారాలు చేసినా అసలైన విజయాన్ని ప్రేక్షకులే మాకు అందించారు. మీ అందరికీ మా సినిమా టీమ్ అంతా రుణపడి ఉంటాం. అన్నారు.

ప్రొడ్యూసర్ నవీన్ యెర్నేని మాట్లాడుతూ - రణబాలి విజయం పట్ల చాలా ఆనందంగా ఉన్నాం. మనం చేసిన సినిమా హిట్ అయి, ప్రశంసలు తీసుకొచ్చి, మంచి వసూళ్లు అందిస్తే అది ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. ఆ విజయం కోసమే మేమంతా పనిచేసేది. రణబాలిని బ్లాక్ బస్టర్ చేసిన ఆడియెన్స్ కు థ్యాంక్స్. ఇలాంటి కథ చెప్పాలనేది మా డైరెక్టర్ రాహుల్ విజన్. రణబాలి పాత్రకు పూర్తి న్యాయం చేశారు మా హీరో విజయ్ దేవరకొండ. జయమ్మగా రశ్మిక జీవించారు. ఇది రెగ్యులర్ మూవీ కాదు. ఒకరకంగా ప్రయోగాత్మక చిత్రం. మా మూవీ మొదటి రోజు కొంత మిక్స్డ్ టాక్ వచ్చినా సాయంత్రం నుంచి పుంజుకుంది. ఇంకా చాలా రోజుల థియేటర్స్ లో సక్సెస్ ఫుల్ గా రన్ కాబోతోంది. విజయ్ గారి కెరీర్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా రణబాలి నిలిచింది. మేము విజయ్ గారితో చేసిన డియర్ కామ్రేడ్, ఖుషి కంటే రణబాలి పెద్ద విజయాన్ని సాధిస్తోంది. కలెక్షన్స్ తో పాటు అప్రిషియేషన్స్ రావడం రణబాలి విషయంలో జరుగుతోంది. అన్నారు.

ప్రొడ్యూసర్ రవిశంకర్ మాట్లాడుతూ - అనంతపురంలో మన సినిమా ఈవెంట్ పెట్టాలనేది విజయ్ గారి కోరిక. ఆయనే పట్టుదలగా ఇక్కడ వేడుక జరిపిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రేక్షకులకు, మా కాస్ట్ అండ్ క్రూ అందరికీ థ్యాంక్స్. మా నటీనటులు, సాంకేతిక నిపుణులు బెస్ట్ ఔట్ పుట్ ఇవ్వడం వల్లే ఈ రోజు రణబాలి ఇంత బాగా వచ్చింది. రణబాలి సినిమాకు అన్ని చోట్ల నుంచి సూపర్ హిట్ కలెక్షన్స్ వస్తున్నాయి. అయితే రాయలసీమ నుంచి ఓవర్ ఫ్లోస్ వస్తున్నాయి. మీరు అంతగా మా సినిమాపై ప్రేమ చూపిస్తున్నారు. అన్నారు.

హీరోయిన్ రశ్మిక మందన్న మాట్లాడుతూ - మీ అందరినీ ఈవెంట్ లో మిస్ అవుతున్నా. బాంబేలో ఒక షూటింగ్ లో ఉండిపోయి అనంతపురం రాలేకపోయాను. రణబాలి సినిమాపై మీరంతా చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు. మీరు సోషల్ మీడియాలో చేస్తున్న రీల్స్, పోస్టులు చాలా హ్యాపీగా అనిపిస్తున్నాయి. జయమ్మ పాత్రను మీరు ఎంతో ఇష్టపడుతుండటం సంతోషంగా ఉంది. అన్నారు.

డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ మాట్లాడుతూ - నేను పుట్టి పెరిగింది చదువుకుంది రాయలసీమలో. ఇక్కడే ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు చూశాను. నేను సినిమాలను ఎంజాయ్ చేసిన థియేటర్స్ లో నా దర్శకత్వంలో వచ్చిన సినిమా హౌస్ ఫుల్స్ తో ప్రదర్శింపబడటం చాలా సంతోషంగా గర్వంగా ఉంది. సీమ ఆడియెన్స్ సినిమాను ఎంతో ప్రేమిస్తారు. చరిత్రలో మరుగున పడిన ఘటనలను సినిమాగా తెరకెక్కించడం అరుదు. హిస్టరీని నేపథ్యంగా తీసుకుని ఇలాంటి పెద్ద స్టార్స్ ను పెట్టుకుని కమర్షియల్ భారీ సినిమా రూపొందించడం సులువైన పని కాదు. మా టీమ్ అందరి సపోర్ట్ తో నేను చేయగలిగాను. ఎంతోమంది మినిమమ్ సెన్స్ లేకుండా మా సినిమాను నెగిటివ్ చేయాలని చూశారు. అయినా మంచి సినిమాను ఎవరూ ఆపలేరని మరోసారి ప్రూవ్ అయ్యింది. అన్ని ప్రాంతాల నుంచి మా సినిమాకు మంచి రిపోర్ట్స్ వస్తున్నాయి. తెలుగు ప్రేక్షకులు అందరికీ థ్యాంక్స్. నా జ్ఞాపకాలు అన్నింటినీ పెట్టి రాసిన స్క్రిప్ట్ ఇది. అందుకే మా సినిమాలో మన కల్చర్ అంత అందంగా కనిపిస్తోంది. నేను పుట్టిన నేల రుణం రణబాలి ద్వారా కొంత తీర్చుకున్నానని భావిస్తున్నా. రణబాలిగా విజయ్ దేవరకొండ ఎంత గొప్పగా పర్ ఫార్మ్ చేశాడో మీరంతా చూశారు. చిరంజీవి, బాలకృష్ణ గారు సీమ యాసను ఎంత అవలీలగా చెప్పారో విజయ్ గారు కూడా అలాగే చెప్పారు. ఆయన డైలాగ్స్ కు విజిల్స్ పడుతున్నాయి. అన్నారు

హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ - తెలుగు గడ్డ ఎంతో గొప్పది, అందమైనది, ఎంతో చరిత్ర ఉన్నది. రకరకాల పండుగలు, పద్ధతులు, యాసలు, మనుషులు ఉన్న నేల మనది. నేను పుట్టిన తెలంగాణలో ఒక ఆవేశం ఉంటుంది, తిరగబడే పోరాటం ఉంటుంది, ఫోక్ సాంగ్స్ లో మజా ఉంటుంది. ఆంధ్ర వెళ్తే చక్కటి వాతావరణం, మంచి మనుషులు, ఆప్యాయత, వాళ్లు జరుపుకునే అందమైన పండుగలు, మంచి ఫోక్ సాంగ్స్ ఉంటాయి. సీమకు వస్తే రణబాలిలో రాయలు ఏలిన సీమ గడ్డ అంటూ ఒక పాట ఉంది. అది నాకు చాలా ఇష్టం. ఈ నాలుగు లైన్ల పాట మన సీమ ఎలాంటిదో చూపిస్తాయి. ఈ రాయలసీమ నాకు ఎంతో ఇచ్చింది. నేను చదువుకుంది ఇక్కడే. ఇక్కడ కొత్త చెరువు అనే ఊరిలో ఒక థియేటర్ ఉండేది. ఆ థియేటర్ లో సినిమాలు చూశాను. ఇప్పుడు మా రణబాలి సినిమా అదే కొత్త చెరువు థియేటర్ లో హౌస్ ఫుల్స్ అవుతుంటే ఎంత అనందంగా ఉందో చెప్పలేను. నేను ప్రయాణం చేసిన అనంతపురం, కర్నూలు, కడప లోనే మా సినిమా షూటింగ్ చేశాం. చిత్రీకరణ సమయంలో చదువుకున్నప్పటి జ్ఞాపకాలన్నీ గుర్తుకొచ్చేవి. రణబాలి సినిమాను ఒక నటుడిగా చేయలేదు. ఈ నేల కథను చెప్పాలనే బాధ్యతతో చేశాను. నాకు ఎంతో ప్రేమను పంచిన రాయలసీమ రుణం తీర్చుకోవాలనే కృతజ్ఞతతో రణబాలి సినిమా చేశాను. ఒక పెద్దాయన మా వీరుల కథ చెప్పావు బిడ్డా అని చేయి పట్టుకుని మాట్లాడుతుంటే ఎంతో సంతోషంగా అనిపించింది. మమ్మల్ని మేము తెరపై చూసుకున్నట్లు ఉందని మీరంతా చెబుతున్నారు. మీ ఆదరణతో వచ్చే తృప్తి ఏ డబ్బూ, ఏ అవార్డు ఇవ్వదు. రణబాలి సినిమాను మీరు ఇంతగా అక్కున చేర్చుకోవడం నటుడిగా నా జీవితానికి ఒక అర్థాన్ని ఇచ్చింది. తెలుగు సినిమా గర్వపడేలా రణబాలి ఉంటుందని చెప్పాను. ఆ మాటను మీరు నిజం చేశారు. రాహుల్ ఎంత గొప్ప సినిమా చేశాడో భవిష్యత్ లో అందరికీ అర్థమవుతుంది. జయమ్మపై మీరు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. తెలుగు ప్రేక్షకులు నాపై పదేళ్లుగా ప్రేమ చూపిస్తున్నారు. ఇటీవల ఆ ప్రేమను మరింతగా చూస్తున్నా. అన్నారు

నటీనటులు - విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న, ఆర్నాల్డ్ వోస్లూ, తదితరులు

## ఆదర్శ కుటుంబం ? హౌస్ నెం. 47' సినిమా ట్రైలర్ విడుదల



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం ? హౌస్ నెం. 47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, నారాయణమ్మ, మాలా పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు ఈ సినిమా నుంచి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్ విడుదలైంది.

గిలిగింతలు పెట్టే హాస్య సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన యాక్షన్, ఆసక్తికరమైన డ్రామాతో ఈ సినిమా ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకాన్ని 'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ కలిగిస్తోంది.

త్రివిక్రమ్ రచన, దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా ట్రైలర్.. ఆయన బలమైన రచనను, విలక్షణమైన కథా శైలిని మరోసారి చూపిస్తోంది. కుటుంబ వినోదానికి యాక్షన్ థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ ఆసక్తిని పెంచుతోంది. కామెడీ, యాక్షన్, సస్పెన్స్‌లను చక్కగా మేళవించిన ట్రైలర్.. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా ఉండబోతోందనే అంచనాలను పెంచుతోంది.

విక్టరీ వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌తో ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆయన చూపించిన ఎనర్జీ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఆయన నటనకు తోడు ఆసక్తికరమైన కథనం, వినోదభరిత సన్నివేశాలు ట్రైలర్‌ను మరింత ఆకట్టుకునేలా చేశాయి. ఇక తమన్ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు అదనపు బలాన్నిచ్చింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో తీవ్రతను పెంచుతూ, కథలోని ఉత్కంఠను మరింతగా ఎలివేట్ చేసింది.

'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక హైదరాబాద్ లోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. "మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ లో ఈ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. మీ అద్భుతమైన స్పందన చూసి ఆనందంగా ఉంది. కాలేజ్ లైఫ్ లో నాకు ఎన్నో మెమోరీస్ ఉన్నాయి. ఈరోజులు మళ్ళీ రావు. మీరు కూడా మంచి మెమోరీస్ ఉండేలా చూసుకోండి. మీ కలను నిజం చేసుకోండి. కాలేజ్ అంటే డిగ్రీ, జాబ్ మాత్రమే కాదు.. మంచి క్యారెక్టర్ తో బయటకు రావాలి. అక్టోబర్ 30న మా సినిమా విడుదలవుతోంది. మీ అందరూ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను." అన్నారు.

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ఈ సినిమా మీరు ఊహించిన పద్ధతిలో కాకుండా, వేరే డైరెక్షన్ లో ఉండే లాంటి అవకాశమున్న సినిమా ఇది. నార్మల్ రొమాంటిక్ కామెడీ కాకుండా వేరే వేరే అంశాలను కూడా డిస్కస్ చేయడం జరిగింది. క్రైమ్ కామెడీ లేదా బ్లాక్ కామెడీ అలాంటివి ట్రై చేశాము. నాకు, వెంకటేష్ గారికి కూడా ఇది ఫస్ట్ అటెంప్ట్. పని చేసేటప్పుడు ఈ సినిమా మా అందరికీ ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. మీక్కూడా నచ్చుతుందని ఆశిస్తున్నాను. అక్టోబర్ 30వ తారీఖున థియేటర్లలో కలుద్దాం. ఈ సినిమాలో పనిచేసిన అందరు టెక్నీషియన్లకు, నటీనటులకు, ముఖ్యంగా వెంకటేష్ గారికి కృతజ్ఞతలు. ప్రొడ్యూసర్ చినబాబు గారికి థ్యాంక్స్ చెప్పుకోవడమంటే ఫ్యామిలీకి థ్యాంక్స్ చెప్పుకోవడమే. ఆయన తరపున కూడా అందరికీ నేనే కృతజ్ఞతలు చెబుతున్నాను. అలాగే తమన్ అద్భుతమైన సంగీతం అందించాడు. ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఫెంటాస్టిక్ జాబ్ చేశాడు. దాదాపు 7-8 పాటలు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లో ఉంటాయి. త్వరలోనే రిలీజ్ చేయబోతున్నాం అవన్నీ. థ్యాంక్యూ. నమస్కారం." అన్నారు.

కథానాయిక శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. "ఇలా స్టూడెంట్స్ మధ్యలో ఈ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. మనకి లైఫ్ లో ఎన్నో ప్లాన్స్ ఉంటాయి. కానీ, లైఫ్ ప్లాన్ మరోలా ఉంటుంది. మనల్ని సర్ప్రైజ్ చేస్తూనే ఉంటుంది. అలాగే మా సినిమాలో కూడా నెక్స్ట్ సీన్ ఏం జరుగుతుంది, ఏమవుతుంది అనే ఆసక్తి ఉంటుంది. ప్రతి సీన్ కి ఓ సర్ప్రైజ్ ఉంటుంది. మీరు మా సినిమా చూసి ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నాను. ఇంత మంచి సినిమాలో అవకాశమిచ్చి, ఎప్పటికీ గుర్తుండిపోయే జ్ఞాపకాలను ఇచ్చిన త్రివిక్రమ్ గారికి కృతజ్ఞతలు. వెంకటేష్ గారు లాంటి లెజెండ్ తో కలిసి నటించడం గౌరవంగా భావిస్తున్నాను. నిర్మాత చినబాబు గారు ఒక పిల్లర్ లాగా మా అందరికీ ఎంతో సపోర్ట్ గా నిలిచారు. తమన్ గారు అద్భుతమైన సంగీతం అందించారు. మీ అందరి లాగే నేను కూడా అక్టోబర్ 30 కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నాను." అన్నారు.

సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ.. "ఆదర్శ కుటుంబం నాకు ప్రత్యేకమైన సినిమా. నా ఫేవరెట్ ఫిల్మ్ నువ్వు నాకు నచ్చావ్. ఎప్పుడు చూసినా ప్రతి సీన్ ఎంజాయ్ చేస్తాను. ఆ కాంబినేషన్ కోసం నేను ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. కొందరు రాస్తే కొందరు మాట్లాడాలి, కొందరు యాక్ట్ చేయాలి అనిపిస్తుంది. జూనియర్ ఎన్టీఆర్, త్రివిక్రమ్ గారి కాంబినేషన్ చూడాలనే కోరిక అరవింద సమేత సినిమాతో తీరిపోయింది. అలాగే త్రివిక్రమ్ గారు, వెంకటేష్ గారి కాంబో. త్రివిక్రమ్ గారు పెర్ఫెక్ట్ ఫ్యామిలీ మ్యాన్. ఫ్యామిలీకి ఏం కావాలో ఆయనకు కరెక్ట్ గా తెలుసు. వెంకటేష్ గారి కోసం ఆయన అద్భుతమైన స్క్రిప్ట్ రాశారు. ఇటీవల బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పూర్తి చేశాను. సినిమా ఫెంటాస్టిక్ గా ఉంది. చాలా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది. నిర్మాత చినబాబు గారు అరవింద సమేత నుంచి నన్ను ఎంతో సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. ఇది త్రివిక్రమ్ గారి ట్రేడ్ మార్క్ ఫిల్మ్. మీ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది." అన్నారు.

బాల నటుడు రాజ్ ప్రజ్వల్, యువినా కూడా ఈ ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో పాల్గొని సినిమా ఘన విజయం సాధించాలని ఆకాక్షించారు. తమదైన మాటలతో విద్యార్థులలో ఉత్సాహం నింపారు.

20 ఏళ్ల తర్వాత విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో సినిమా వస్తుండటంతో 'ఆదర్శ కుటుంబం ? హౌస్ నెం. 47'పై ఆసక్తి నెలకొంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్లోనూ మంచి క్రేజ్ ఉన్న ఈ కలయిక.. మరోసారి నవ్వులు, భావోద్వేగాలు, యాక్షన్, ఉత్కంఠతో కూడిన పూర్తిస్థాయి వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

అద్భుతమైన ట్రైలర్ తో 'ఆదర్శ కుటుంబం ? హౌస్ నెం. 47'పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. క్రైమ్ థ్రిల్లర్ అంశాలతో కూడిన పూర్తిస్థాయి వినోదం అందించబోతోందనే అంచనాలతో ఈ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. దీపావళి వారాంతానికి ముందు అక్టోబర్ 30న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

నటీనటులు: వెంకటేష్, శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్, యువినా, రాజ్ ప్రజ్వల్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, ఉదయ్‌బీర్ సంధు, వెన్నెల కిషోర్, రఘుబాబు తదితరులు.

## ఒకే ఒక జీవితం' సినిమాలో హీరోయిన్ గా రుక్మిణి వసంత్

దక్షిణాది సినీ పరిశ్రమలో సెన్సేషన్‌గా మారిన రుక్మిణి వసంత్, దర్శకుడు శ్రీ కార్తిక్‌తో చేతులు కలిపారు. వీరిద్దరి కలయికలో తెరకెక్కనున్న ఈ కొత్త సినిమా ఇప్పటికే ట్రేడ్ వర్గాలతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తిని పెంచుతోంది. హై కాన్సెప్ట్ సైన్స్ ఫిక్షన్, టైమ్ ట్రావెల్ కథాంశానికి తల్లీకొడుకుల మధ్య హత్తుకునే భావోద్వేగాలను జోడించి తెరకెక్కించిన 'ఒకే ఒక జీవితం' (తమిళంలో 'కణం') విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తర్వాత శ్రీ కార్తిక్ తెరకెక్కించనున్న నెక్స్ట్ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'సప్త సాగరాలు దాటి' చిత్రంలో తన అద్భుతమైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న రుక్మిణి వసంత్ ఈ సినిమాలో కథానాయికగా నటించనున్నారు. దేవ్ రామనాథ్, వినాయక్ వైద్యనాథన్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు. ఇందులో రుక్మిణి వసంత్‌ను 'తారా'గా పరిచయం చేశారు. ఈ వీడియోతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు శ్రీ కార్తిక్, నటులు దేవ్ రామనాథ్, వినాయక్ వైద్యనాథన్ కలిసి 'తారా' పాత్రను ఖరారు చేయడానికి సమయం మించిపోతోందని చర్చించుకుంటుండగా, వారికి ఓ నోటిఫికేషన్ వస్తుంది. అది వారిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇలా ఆసక్తికరమైన సరదా సన్నివేశాలతో సాగిన వీడియో చివర్లో రుక్మిణి వసంత్‌ను పరిచయం చేశారు.

చిత్రాన్ని సిరుని సినీ కార్పొరేషన్, మ్యాడ్‌బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సాయికృష్ణ గద్వాల్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నిర్మాత జస్వంత్ నడిపల్లితో అనుబంధం ఉన్న సిరుని సినీ కార్పొరేషన్ గతంలో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన 'చి ల సౌ' చిత్రానికి మద్దతుగా నిలిచింది. ఈ సినిమా ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే విభాగంలో జాతీయ చలనచిత్ర అవార్డును అందుకుంది. కంటెంట్‌కు ప్రాధాన్యమిచ్చే సినిమాలు, విభిన్నమైన కథనాలను ప్రోత్సహిస్తూ సిరుని సినీ కార్పొరేషన్ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.




దేవ్ రామనాథ్, శ్రీ కార్తిక్ నేతృత్వంలోని మ్యాడ్‌బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ విభిన్నమైన, ఒరిజినల్ కథలను రూపొందించే క్రియేటర్ ఆధారిత కంటెంట్ స్టూడియోగా గుర్తింపు పొందింది. వీరు రూపొందించిన పాపులర్ తమిళ వెబ్ సిరీస్ 'ఐ హేట్ యు ? ఐ లవ్ యు', అవార్డు గెలుచుకున్న షార్ట్ ఫిల్మ్ 'చైల్డ్‌హుడ్ డైరీస్' ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందాయి.

ఈ కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ కోసం గత ఏడాదిన్నర కాలంగా ఈ సినిమాను రూపొందించడానికి తాము చేసిన ప్రయాణాన్ని ప్రతిబింబించేలా ఇన్‌స్టాగ్రామ్ ప్రత్యేక డాక్యు-డ్రామా రీల్ సిరీస్‌ను చిత్రబృందం రూపొందించింది. తాజాగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో ఆ సిరీస్‌లో ఒక కీలకమైన మైలురాయిగా నిలిచింది.

'కీడా కోలా', 'కాంత' వంటి ప్రత్యేకమైన చిత్రాలతో అనుబంధం ఉన్న సాయికృష్ణ గద్వాల్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో కో-ప్రొడ్యూసర్‌గా

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com